


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 316 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : నరసరావుపేట శుక్రవారం 17 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE 316 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NARASARAO PETA FRI 17 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur





### అమరావతిలో జగన్నాథ రథయాత్ర..

## బంగారు చీపురుతో ఊడ్చి సేవ చేసిన సీఎం చంద్రబాబు

- రాజధాని అమరావతిలో తొలిసారిగా జగన్నాథ రథయాత్ర
- బంగారు చీపురుతో ఊడ్చి రథాన్ని లాగిన సీఎం చంద్రబాబు
- ఆధ్యాత్మికతతోనే ఒత్తిడి దూరం అవుతుందన్న ముఖ్యమంత్రి
- రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని ప్రకటన
- అమరావతి, పోలవరం పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలిసారిగా జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూరీలో నిర్వహించే సంప్రదాయ క్రతువు తరహాలో రథం ముందు భాగాన్ని బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రం చేసి చంద్రబాబు తన సేవను చాటుకున్నారు. అనంతరం జగన్నాథుడు, బలభద్ర, సుభద్రలు ఆశీనులైన రథాన్ని తాడుతో లాగి యాత్రను ప్రారంభించారు.

- మిగతా 2లో



## ఏపీలో ఈ నెల 22న 'తల్లికి వందనం' నిధులు విడుదల...

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 2026–27 విద్యా సంవత్సరానికి గానూ ఈ పథకం అమలు, మార్గదర్శకాల కోసం పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం జీవో నెం.15, జీవో నెం.16 జారీ చేశారు. ఈ పథకం కోసం రూ.10,120.78 కోట్లు మంజూరు చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 42,70,802 మంది తల్లులకు, వారి 67,47,190 మంది పిల్లలకు లబ్ధి చేకూరనుంది. జులై 22వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు జమ చేయనున్నారు. విద్యార్థుల్లో డ్రాపౌట్లను తగ్గించి, వారి చదువులో తల్లుల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తోంది.దగత విద్యా సంవత్సరం (2025–26) నుంచి అమలవుతున్న ఈ పథకం కింద, 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న పిల్లలను బడికి పంపుతున్న ప్రతి తల్లికి, వారి పిల్లల సంఖ్యతో నిమిత్తం లేకుండా

- మిగతా 2లో

- తల్లికి వందనం' పథకానికి రూ.10,120.78 కోట్లు మంజూరు
- 42.70 లక్షల మంది తల్లులు, 67.47 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకు రూ.15,000 ఆర్థిక సాయం
- పాఠశాల నిర్వహణ కోసం రూ.2,000 మినహాయింపు, తల్లి ఖాతాలో రూ.13,000 జమ
- 2026-27 విద్యా సంవత్సరానికి పథకం అమలుకు ఉత్తర్వులు

## రాష్ట్రాన్ని దోచేస్తున్నారు.. అప్పుల్లో రికార్డులు సృష్టిస్తున్నారు

- జగన్ అధ్యక్షతన వైసీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం
- కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన జగన్
- ప్రభుత్వ భూములను దోచిపెడుతున్నారని మండిపాటు
- అమరావతిలో చదరపు అడుగుకు రూ. 20 వేలకు పైగా ఖర్చు చూపిస్తున్నారని ఆరోపణ
- ప్రతి రంగంలో మాఫియా రాజ్యమేలుతోందని విమర్శ



- మిగతా 2లో



## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?..

### కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

- ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే లేఖ
- డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి డిమాండ్
- సవరించిన బిల్లులపై ముందస్తు చర్చకు విజ్ఞప్తి
- ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందని బిల్లు
- పార్టీలకు అధ్యయనం చేసేందుకు సమయం ఇవ్వాలని విన్నపం

**పెన్ పవర్ డెస్క్:**పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని

- మిగతా 2లో



## డ్రగ్స్ కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ కుమారుడు..?

- మంగళ్‌హాట్‌లో డ్రగ్స్ ముఠాపై పోలీసుల దాడి
- ఎమ్మెల్సీ కుమారుడితో సహా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు ఐఏఎన్ఎస్ కథనం
- వారి నుంచి హ్యాష్ ఆయిల్, గంజాయి స్వాధీనం
- తన కుమారుడు డ్రగ్స్ తీసుకోలేదని ఖండించిన ఎమ్మెల్సీ
- కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నలుగురి కోసం గాలింపు

- మిగతా 2లో

## సొంత పార్టీ నేతపై వేటు..

### అవినీతికి పాల్పడే మంత్రులు, ఉద్యోగులకు సీఎం విజయ్ వార్నింగ్

- తన ప్రభుత్వంలో లంచాలకు, అవినీతికి తావు లేదన్న విజయ్
- ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ లక్ష్యమని వెల్లడి
- అవినీతికి పాల్పడేవారికి రెండో ఛాన్స్ ఉండదని స్పష్టీకరణ

2లో



## న్యూజిలాండ్‌లో భూకంపం... సునామీ హెచ్చరిక జారీ

- న్యూజిలాండ్ దక్షిణ దీవిని వణికించిన భూకంపం
- రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదైన తీవ్రత
- పశ్చిమ తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ
- ప్రజలు ఎత్తైన ప్రాంతాలకు వెళ్లాలని అధికారుల సూచన
- తక్షణ ప్రాణ, ఆస్తి నష్టంపై సమాచారం లేదు

**పెన్ పవర్ డెస్క్:**న్యూజిలాండ్‌లో భూకంపం సంభవించింది. దేశంలోని దక్షిణ దీవిలో గురువారం 6.3 తీవ్రతతో భూమి కంపించడంతో అధికారులు వెంటనే సునామీ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో పశ్చిమ తీర ప్రాంత ప్రజలు తీవ్ర

- మిగతా 2లో



## ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాల అంశంపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు



- కుడంకుళం అణు కేంద్రం నుంచి సున్నితమైన డేటా ఏదీ లీక్ కాలేదని స్పష్టీకరణ
- ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాలపై ఆందోళన అవసరం లేదని వెల్లడి
- గగన్‌యాన్ వంటి కీలక ప్రాజెక్టులపై ఎలాంటి ప్రభావం ఉండదని హామీ
- డేటా లీక్ కాంట్రాక్టర్ సర్వర్‌లో జరిగిందని తెలిపిన మంత్రి జితేంద్ర సింగ్

- మిగతా 2లో

## యుద్ధం వేళ ఉక్రెయిన్‌లో కీలక మార్పు..



### కొత్త ప్రధానిగా సెర్హీ కోరెట్స్కీ

- ఇంధన రంగ నిపుణుడైన కోరెట్స్కీని ఎంపిక చేసిన జెలెన్స్కీ
- కోరెట్స్కీ నియామకానికి ఆమోదం తెలిపిన ఉక్రెయిన్ పార్లమెంట్
- రక్షణ దళాల బలోపేతం, శీతాకాల సన్నద్ధతే ప్రధాన లక్ష్యాలు

- మిగతా 2లో




## యుద్ధం వేళ ఉక్రెయిన్‌లో కీలక మార్పు.. కొత్త ప్రధానిగా సెర్హీ కోరెట్స్కీ

రష్యాతో భీకర యుద్ధం కొనసాగుతున్న తరుణంలో ఉక్రెయిన్‌లో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. దేశ నూతన ప్రధానమంత్రిగా ఇంధన రంగ నిపుణుడు సెర్హీ కోరెట్స్కీ నియమితులయ్యారు. ఆయన నియామకానికి ఉక్రెయిన్ పార్లమెంట్ గురువారం ఆమోదముద్ర వేసింది. దేశ ఇంధన మౌలిక సదుపాయాలపై రష్యా దాడులు తీవ్రతరం చేస్తున్న నేపథ్యంలో, ఈ రంగానికి చెందిన అనుభవజ్ఞుడికి ప్రధాని పగ్గాలు అప్పగించడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇటీవల మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రధాని యూలియా స్విరిడెంకో తన పదవికి రాజీనామా చేయగా, ఆమె స్థానంలో ప్రభుత్వ రంగ ఇంధన సంస్థ 'నాఫ్టోగాజ్' సీఈఓగా పనిచేస్తున్న సెర్హీ కోరెట్స్కీ పేరును జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. పార్లమెంట్ సభ్యులు ఈ ప్రతిపాదనను ఆమోదించారు. 2022లో రష్యా పూర్తిస్థాయి దండయాత్ర ప్రారంభించిన తర్వాత ఉక్రెయిన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మూడో వ్యక్తిగా కోరెట్స్కీ నిలిచారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కోరెట్స్కీ తన ప్రాధాన్యతలను స్పష్టం చేశారు. "ఉక్రెయిన్ రక్షణ దళాలను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయడం, రక్షణ పరిశ్రమల అభివృద్ధిని వేగవంతం చేయడం, రాబోయే శీతాకాలాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడం మా ప్రథమ కర్తవ్యం" అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. వీటితో పాటు సామాజిక బాధ్యతలను నెరవేర్చడం, యూరోపియన్ యూనియన్‌లో చేరే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యాలని ఆయన వివరించారు. 48 ఏళ్ల కోరెట్స్కీకి ఇంధన రంగంలో అపార అనుభవం ఉంది. అయితే, ఆయనకు గతంలో ఎలాంటి రాజకీయ పదవుల అనుభవం లేదు. రష్యా దాడుల నడుమ దేశ ఇంధన స్థిరత్వాన్ని కాపాడటంలో నాఫ్టోగాజ్ సీఈఓగా ఆయన కీలక పాత్ర పోషించారు.

## ఏపీలో ఈ నెల 22న 'తల్లికి వందనం' నిధులు విడుదల...

**- మొదటి పేజి తరువాయి**

ఒక్కో బిడ్డకు ఏటా రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్-ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఈ పథకం వర్తిస్తుంది.

**నిధుల కేటాయింపు, చెల్లింపు విధానం**

ప్రతి విద్యార్థికి అందించే రూ.15,000 ఆర్థిక సహాయం నుంచి రూ.2,000 పాఠశాలలు, జూనియర్ కళాశాలల నిర్వహణ, పారిశుధ్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం మినహాయిస్తారు. మిగిలిన రూ.13,000 నేరుగా అర్హులైన తల్లుల ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తారు. ఈ ప్రక్రియ ద్వారా నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, తల్లులను ఆర్థికంగా ప్రోత్సహించడం కూడా ప్రభుత్వ ఉద్దేశం.

**పథకానికి అర్హతలు ఇవే:**

'తల్లికి వందనం' పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన అర్హత నిబంధనలను నిర్దేశించింది. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు (గ్రా+వాఔ) శాఖ ఆరు దశల ధ్రువీకరణ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది.

ఆదాయం: గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ నెలసరి ఆదాయం రూ.10,000, పట్టణ ప్రాంతాల్లో రూ.12,000 మించకూడదు.

భూమి: మాగాణి అయితే 3 ఎకరాల లోపు, మెట్టభూమి అయితే 10 ఎకరాల లోపు ఉండాలి. రెండూ కలిపి ఉన్నా 10 ఎకరాల పరిమితికి లోబడే ఉండాలి.

వాహనం: కుటుంబంలో ఎవరి పేరు మీదా నాలుగు చక్రాల వాహనం ఉండరాదు. అయితే, టాక్సీ, ట్రాక్టర్, ఆటోలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు.

విద్యుత్ వినియోగం: కుటుంబం నెలసరి విద్యుత్ వినియోగం సగటున 300 యూనిట్లకు మించరాదు. దీని కోసం గత 12 నెలల సగటును పరిగణనలోకి తీసుకుంటారు.

ఆస్తి: పట్టణ ప్రాంతాల్లో నివసించే కుటుంబానికి 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో మున్సిపల్ ఆస్తి ఉండకూడదు.

ప్రభుత్వ ఉద్యోగం: కుటుంబ సభ్యుల్లో ఎవరూ కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా లేదా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగిగా ఉండరాదు. ప్రభుత్వ పింఛనుదారులకు కూడా ఇది వర్తించదు. పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నిర్దేశిత ఆదాయ పరిమితి లోపు జీతం తీసుకునే వారికి మినహాయింపు ఉంటుంది.

ఆదాయ పన్ను: కుటుంబంలో ఏ ఒక్క సభ్యుడు కూడా ఆదాయపు పన్ను చెల్లింపుదారుగా ఉండకూడదు.

చదువు: విద్యార్థులు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాల/జూనియర్ కళాశాలలో చదువుతూ ఉండాలి. ఐటీఐ, పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ వంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందే కోర్సులకు ఈ పథకం వర్తించదు.

**ప్రత్యేక నిబంధనలు, చెల్లింపులు**

అనాథలు: స్వచ్ఛంద సంస్థల ద్వారా పాఠశాలల్లో చేరిన అనాథలు, వీధి బాలలు ఈ పథకానికి అర్హులే. సంబంధిత జిల్లా కలెక్టర్ వారి తరపున గార్డియన్-ఆపరేటెడ్ బ్యాంకు ఖాతాను తెరిచి, నిధులు సక్రమంగా అందేలా పర్యవేక్షిస్తారు.

ఆర్‌టీఈ విద్యార్థులు: విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) కింద ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల విషయంలో, ప్రభుత్వం నిర్దేశించిన ఫీజును నేరుగా పాఠశాల యాజమాన్యానికి చెల్లిస్తారు. ఆ మొత్తం పోగా ఏమైనా మిగిలితే, దానిని తల్లి ఖాతాలో జమ చేస్తారు.

ఇతర స్కాలర్‌షిప్‌లు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు పొందుతున్నట్లయితే, ఆ పథకం కింద వచ్చే మొత్తాన్ని మినహాయించి, మిగిలిన బ్యాలెన్స్ మొత్తాన్ని 'తల్లికి వందనం' కింద చెల్లిస్తారు.

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?.. కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

**- మొదటి పేజి తరువాయి**

నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు-2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

# ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు..

- స్టెనో నుంచి సబ్ రిజిస్ట్రార్ వరకు ఉద్యోగ ప్రస్థానం
- ఉమ్మడి రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ వరకు పోస్టింగ్‌ల వివరాలు
- వరుస బదిలీలతో సాగిన అధికారిక ప్రయాణం
- అక్రమాస్తులపై వస్తున్న ఆరోపణలు.. నిజానిజాలపై ప్రశ్నలు
- పత్రాలు, ఆధారాల సేకరణలో పెన్ పవర్ ప్రత్యేక బృందం

**ఏలూరు జిల్లా భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించిన ఆరోపణలపై పెన్ పవర్ నిర్వహిస్తున్న ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ టీం కథనాల శ్రేణిలో ఎపిసోడ్-3 .**

**స్టెనోగా ప్రారంభమైన ఉద్యోగ జీవితం.. సబ్ రిజిస్ట్రార్‌గా వరుస పోస్టింగులు.. ఇప్పుడు వక్ర మార్గంలో కోట్ల విలువైన ఆస్తులపై వస్తున్న ఆరోపణలు. ఇవన్నీ చట్టబద్ధ ఆదాయంతోనే సమకూరాయా? లేక ఇతర ఆదాయ వనరులు ఉన్నాయా? అనే ప్రశ్నలకు సమాధానాల కోసం పెన్ పవర్ ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ టీం ఆస్తుల చిట్టా దుమ్ము దులుపుతుంది.. ఈ క్రమంలో విస్తుపోయే నిజాలు ఒక్కటిగా వెలుగు చూస్తున్నాయి.** **ఎడిటర్, పెన్ పవర్ జూలై 16:**

ఈ ఎపిసోడ్‌లో సంబంధిత అధికారి ఉద్యోగ ప్రస్థానం, ఆయనపై వస్తున్న ఆస్తుల ఆరోపణలు, వాటి వెనుక ఉన్న ప్రశ్నలను పరిశీలిస్తోంది. సమాచారం ప్రకారం వి. రాఘవేంద్ర ప్రసాద్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో స్టెనోగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సేవలు ప్రారంభించిన ఆయన, అనంతరం పదోన్నతితో 2017లో (ఇప్పటి తెలంగాణ రాష్ట్రంలో) అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో హైదరాబాద్ ఎస్.ఆర్. నగర్ డీఐజీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. తర్వాత 2018లో చిట్యాల సబ్ రిజిస్ట్రార్‌గా తొలి పోస్టింగ్ పొందారు. అక్కడ 2018--2019 వరకు విధులు నిర్వహించిన అనంతరం, రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ని ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అక్కడ 2019 నుంచి 2022 వరకు పనిచేశారు.

ఆ తర్వాత 2022 నుంచి 2024 వరకు అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించారు. అనంతరం 2024లో భీమడోలు సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టి ప్రస్తుతం కొనసాగుతున్నారు.

ఇంతవరకు ఉద్యోగ ప్రస్థానంలో, ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన పేరుతో కాకుండా కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లపై కూడా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయవాడ నగరంలో కుమారుడి పేరుతో హోటల్, తండ్రి పేరుతో ఇతర ఆస్తులు, బంధువుల పేర్లపై మరిన్ని ఆస్తులు ఉన్నాయనే సమాచారం పెన్ పవర్ పరిశీలనలోకి వచ్చింది. అయితే ఈ ఆస్తులన్నీ చట్టబద్ధ ఆదాయంతోనే సమకూరాయా? లేక ఇతర ఆదాయ వనరులు ఏమైనా ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత పత్రాలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, ఇతర ఆధారాలను సేకరించి వాస్తవాలను వెలికితీసేందుకు పెన్ పవర్ ప్రత్యేక దర్యాప్తు కొనసాగిస్తోంది.

**ఎపిసోడ్ -4లో..**
**విజయవాడలో హోటల్ ఎవరి పేరుతో కొన్నారు..? పెట్టుబడి ఎంత..?**
**రిజిస్ట్రేషన్ పత్రాలు ఏమి చెబుతున్నాయి..?**
**చదువుతూనే ఉండండి పెన్ పవర్ తెలుగు దినపత్రిక**

## రాష్ట్రాన్ని దోచేస్తున్నారు.. అప్పుల్లో రికార్డులు సృష్టిస్తున్నారు

వైసీపీ అధినేత జగన్ అధ్యక్షతన ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేసిన జగన్... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఉభయ సభల్లో గళం విప్పాలని పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు వైసీపీ మద్దతుగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై జగన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోటీ పరీక్షలు నిర్వహించకుండానే డీఎస్పీ పోస్టులను భర్తీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే ఒక పెద్ద స్కామ్ అని ఆరోపించారు. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో తీవ్రమైన అవకతవకలు జరిగాయని విమర్శించారు. తమ వారికి ఉద్యోగాలు ఇచ్చుకోవడానికి ప్రత్యేకంగా జీవోలు తెచ్చి... ఆ పని పూర్తికాగానే జీవోలను రద్దు చేశారన్నారు. స్పోర్ట్స్ అసోసియేషన్లు సైతం వారి చేతుల్లోనే ఉన్నాయని, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్, జూడో సంఘానికి నారా లోకేశ్ తోడల్లుడు భరత్ గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా దోచిపెడుతున్నారని జగన్ మండిపడ్డారు. అమరావతి రాజధాని నిర్మాణంలో చదరపు అడుగుకు రూ. 20,000 పైనే ఖర్చు చూపిస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా దోపిడీ చేస్తున్నారని, భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్)కు ఒప్పుకోని రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "వైసీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ. 5,000 కోట్ల విలువతో నిర్మితమైన రామాయపట్నం పోర్టును కేవలం రూ. 1,500 కోట్లకే ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం పెద్ద కుంభకోణం కాదా? ఇలాంటి ఆదాయ వనరులను ప్రైవేటుకు ఇస్తే రాష్ట్రానికి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది?" అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అప్పులు చేయడంలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోందని జగన్ ధ్వజమెత్తారు. ఎఫ్‌ఆర్‌బీఎం చట్టం పరిమితులను సైతం ఉల్లంఘించి గత రెండేళ్లలోనే రూ. 3.6 లక్షల కోట్ల భారీ అప్పులు చేశారని ఆరోపించారు. ఇంత అప్పు తెచ్చినా... ప్రజలకు, రాష్ట్రానికి చేసింది మాత్రం శూన్యమని విమర్శించారు. ఇసుక, మైన్స్, లిక్కర్ ఇలా ప్రతి రంగంలోనూ మాఫియా రాజ్యమేలుతోందని ఆరోపించారు.

## డ్రగ్స్ కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ కుమారుడు..?

హైదరాబాద్‌లో డ్రగ్స్ వ్యవహారం మరోసారి కలకలం రేపింది. నగరంలోని మంగళ్‌హాట్ ప్రాంతంలో పోలీసులు జరిపిన దాడిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పి. వెంకట్రామ్ రెడ్డి కుమారుడు భరత్ రాజ్ రెడ్డితో పాటు మరో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే, తన కుమారుడు డ్రగ్స్ వినియోగించలేదని, అతడిని అరెస్ట్ చేయలేదని ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి స్పష్టం చేశారు. ఐఏఎన్ఎస్ కథనం మేరకు.. బుధవారం రాత్రి మంగళ్‌హాట్‌లో ఓ ముఠా గంజాయి, హ్యాష్ ఆయిల్ కొనుగోలు చేసి సేవిస్తోందని తెలియడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో భరత్ రాజ్ రెడ్డి, అభిషేక్, యునిత్‌లను పట్టుకోగా, మరో నలుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి 24 గ్రాముల హ్యాష్ ఆయిల్, 22 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురిని మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, రక్త నమూనాలను సేకరించారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న సోని, వంశీ, మనోజ్, తులిజాల కోసం గాలిస్తున్నారు.

కాగా, ఈ ఆరోపణలను ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తన కుమారుడు భరత్ రెడ్డి డ్రగ్స్ తీసుకున్నాడని, అతడిని అరెస్ట్ చేశారని వస్తున్న వార్తల్లో నిజం లేదని ఓ ప్రకటనలో తెలిపారు. "ఒక కామన్ ఫ్రెండ్ ఫోన్ కాంటాక్ట్ లిస్ట్‌లో నంబర్ ఉండటంతో, డ్రగ్స్ కేసుకు సంబంధించి విచారణకు సహకరించాలని పోలీసులు మా ఇంటికి వచ్చారు. విచారణలో నా కుమారుడు డ్రగ్స్ తీసుకోలేదని తేలింది. అతడిని అరెస్ట్ చేయలేదు" అని ఆయన వివరించారు. ఈ ప్రాంతంలో తరచూ డ్రగ్స్ కేసులు నమోదవుతుండటంతో పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు.

## సొంత పార్టీ నేతపై వేటు.. అవినీతికి పాల్పడే మంత్రులు, ఉద్యోగులకు సీఎం విజయ్ వార్నింగ్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పాలనా దృక్పథం ఏంటో మరోసారి చూపించారు. అవినీతి, అధికార దుర్వినియోగంపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తన ప్రభుత్వంలో లంచాలకు, అవినీతికి తావులేదని... తప్పు చేసిన వారికి రెండో అవకాశం ఉండే ప్రసక్తే లేదని ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజలకు పూర్తి పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ లక్ష్యమని చెప్పారు.

సొంత పార్టీ నేతపైనే వేటు: ఇటీవల తమిళనాడు వెల్ఫేర్ అసోసియేషన్ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా జాయింట్ సెక్రటరీ వీరాస్వామి (టీవీకే పార్టీ) లంచం తీసుకుంటున్నట్లు ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. దీనిపై తీవ్ర రాజకీయ విమర్శలు రావడంతో... విజయ్ ఏమాత్రం ఉపేక్షించకుండా ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవుల నుంచి తక్షణమే తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అనంతరం పోలీసులు కూడా వీరాస్వామిని అరెస్ట్ చేశారు.

ఇటీవల కరూర్‌లో జరిగిన ప్రజాసభలో విజయ్ మాట్లాడుతూ ప్రజలకు కొండంత భరోసా ఇచ్చారు. "ఎవరైనా లంచం అడిగితే నిర్భయంగా 'ఇవ్వను' అని చెప్పండి. మీ వెనుక నేను ఉంటాను. ఒకవేళ ఇంకా ఒత్తిడి చేస్తే... ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న విజయ్ మా వెన్నంటి ఉన్నాడని ధైర్యంగా చెప్పండి" అంటూ ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. ప్రజా ప్రభుత్వంలో అవినీతిని కూకటివేళ్లతో నిర్మూలించడానికి తాము కట్టుబడి ఉన్నామని... ప్రజల సహకారంతోనే ఈ మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సొంత పార్టీ కీలక నేతపైనే కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా... అవినీతి విషయంలో తాను ఎంత కఠినంగా ఉంటానో విజయ్ చెప్పకనే చెప్పినట్లయింది.

## అమరావతిలో జగన్నాథ రథయాత్ర..

## బంగారు చీపురుతో ఊడ్చి సేవ చేసిన సీఎం చంద్రబాబు

**- మొదటి పేజి తరువాయి**

ఈ మహోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి పి.నారాయణ, స్థానిక శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, వేలాదిగా భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. ఈ సందర్భంగా, అమరావతి బృహత్ ప్రణాళిక చిత్రపటాన్ని శిరస్సుపై ధరించి, రాజధాని నగరం విశ్వనగరంగా ఎదగాలని ఆయన జగన్నాథ స్వామిని ప్రార్థించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. దేశంలో పూరీ జగన్నాథ రథయాత్రకు ఎంతో విశిష్టత ఉందని, అందరూ అక్కడికి వెళ్లలేరని, అలాంటిది తొలిసారిగా అమరావతిలో ఈ యాత్ర నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ఈ యాత్రలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఇకపై ప్రతిఏటా అమరావతిలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తామని ఇస్కాన్ ప్రకటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్‌లు అందిస్తున్న సేవలను చంద్రబాబు కొనియాడారు. దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో 25 వేలకు పైగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షయపాత్ర నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రపంచంలోనే ఇంత పెద్ద ఎత్తున 500 కోట్ల మందికి ఆహారం అందించడం అరుదైన విషయమని ప్రశంసించారు. ఏపీలో 10 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా రోజూ 1.80 లక్షల మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నట్లు వివరించారు.

ఆధునిక జీవనశైలి వల్ల ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావిస్తూ, మానవ సంబంధాలు తగ్గి సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం కుటుంబాలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, జీవితాల్లో ఒత్తిడిని దూరం చేసుకోవాలంటే ఆధ్యాత్మికత ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. "మైక్రో ఫ్యామిలీలు కాదు, ఉమ్మడి కుటుంబాలు కావాలి. అదే మన భారతీయ సంప్రదాయం" అని ఆయన పిలుపునిచ్చారు. సమాజం ప్రశాంతంగా ఉండటానికి దేవాలయాలు దోహదపడతాయని, అందుకే రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలను నిర్మించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. భారతీయ సంస్కృతిని కాపాడేందుకు ఇస్కాన్ వంటి సంస్థలతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు మేలు చేయడమే తమ ప్రభుత్వ సంకల్పమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. జగన్నాథ రథయాత్ర తలపెట్టగానే అమరావతిలో వర్షం కురిసి వాతావరణం చల్లబడటం శుభసూచకమని అన్నారు. ఆ జగన్నాథ స్వామి కృప రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

## ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాల అంశంపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు

కుడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి సంబంధించిన డేటా లీక్ వ్యవహారం, ఇస్రోలో కీలక శాస్త్రవేత్తల రాజీనామాలను నియంత్రించేందుకు ప్రవేశపెట్టిన నూతన విధానంపై వ్యక్తమవుతున్న ఆందోళనలపై కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్పందించారు. ఈ రెండు అంశాల్లోనూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టుల భద్రతకు, పురోగతికి ఎలాంటి విఘాతం కలగదని ఆయన భరోసా ఇచ్చారు.

ఇటీవల 'వరల్డ్ లీక్స్' అనే రాన్సమ్‌వేర్ గ్రూప్, కుడంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన సుమారు 19,000 ఫైళ్లను డార్క్ వెబ్‌లో బహిర్గతం చేసినట్లు వార్తలు వచ్చాయి. సుమారు 14.3 జీబీ డేటా కలిగిన ఈ ఫైళ్లలో ప్లాంట్ బ్లూప్రింట్లు, సరఫరాదారుల వివరాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. దీనిపై మంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ, ప్లాంట్‌కు సంబంధించిన ఎటువంటి సున్నితమైన సమాచారం లీక్ కాలేదని, వ్యూహాత్మక భద్రతకు ఎలాంటి ముప్పు లేదని తేల్చిచెప్పారు. ఈ డేటా లీక్ అనేది ప్లాంట్ కాంట్రాక్టర్లలో ఒకరికి చెందిన థర్డ్-పార్టీ సర్వర్ నుంచి పాక్షికంగా జరిగినట్లు గుర్తించామని, దీనిపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని వివరించారు. మరోవైపు, గగన్‌యాన్ వంటి కీలక ప్రాజెక్టులలో విధులు నిర్వహిస్తున్న గ్రూప్ 'ఏ' శాస్త్రవేత్తలు, సాంకేతిక ద సిబ్బంది రాజీనామాలను తక్షణమే ఆమోదించవద్దని అంతరిక్ష విభాగం జులై 14న ఒక మెమో జారీ చేసింది. దీనిపై మంత్రి మాట్లాడుతూ, ఇది కేవలం పరిపాలనాపరమైన నిర్ణయమని, ఉన్నత స్థాయిలో బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునేందుకే ఈ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'చాలామంది వస్తుంటారు, పోతుంటారు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ సైతం ఈ నిర్ణయం వల్ల ప్రాజెక్టుల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని స్పష్టం చేశారు.

## న్యూజిలాండ్‌లో భూకంపం... సునామీ హెచ్చరిక జారీ

**- మొదటి పేజి తరువాయి**

భయాందోళనలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే, ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఫియోర్డ్‌ల్యాండ్ రీజియన్‌లోని టె అనౌకు 40 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ భూకంపం కారణంగా మిల్ఫోర్డ్ సౌండ్ నుంచి ప్యూసెగుర్ పాయింట్ వరకు ఉన్న దక్షిణ దీవి పశ్చిమ తీరానికి సునామీ హెచ్చరికలు జారీ చేశారు. సముద్రపు అలలు తీరప్రాంతాల్లోకి చొచ్చుకువచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు తక్షణమే ఎత్తైన ప్రదేశాలకు లేదా లోతట్టు ప్రాంతాల నుంచి దూరంగా వెళ్లాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు నడిచి, పరిగెత్తి లేదా సైకిళ్లపై సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

ఆస్ట్రేలియన్, పసిఫిక్ టెక్టానిక్ ప్లేట్ల సరిహద్దులో న్యూజిలాండ్ ఉండటంతో ఇక్కడ తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి. 2011లో సంభవించిన క్రైస్ట్‌చర్చ్ భూకంపం 185 మందిని బలిగొన్న విషయం తెలిసిందే. తాజా భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ప్రధాన ఆస్తి నష్టం గానీ జరిగినట్లు ఇంకా సమాచారం అందలేదని, పరిస్థితిని సమీక్షిస్తున్నామని జాతీయ అత్యవసర నిర్వహణ ఏజెన్సీ (ఎన్ఈఎంఏ) అధికారులు తెలిపారు.

# యథావిధిగా కొనసాగుతున్న హైయర్ బస్ డ్రైవర్ల సమ్మె

### పలు కార్మిక సంఘాల సంఘీభావం సీఐటీయూ ఆధ్వర్యంలో మద్దతు

**చీరాల, పెన్ పవర్, జూలై 16:** చీరాల డిపో పరిధిలోని హైయర్ బస్ డ్రైవర్ల సమ్మె గురువారం కూడా యథావిధిగా కొనసాగింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ డ్రైవర్లు ఆందోళనను కొనసాగిస్తున్నారు. సమ్మెకు పలు రంగాల కార్మిక సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి డ్రైవర్లకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన హక్కులను కాలరాయడం తగదని, యాజమాన్యం చర్చలకు ముందుకు వచ్చి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని నాయకులు కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు హైయర్ బస్ డ్రైవర్ల పోరాటానికి తమ సంఘీభావం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హైయర్ బస్ డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మరియు ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా మోటారు స్కూటర్ల పంపిణీ : మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్





**గుంటూరు, పెన్ పవర్,జులై 16 :** విభిన్న ప్రతిభావంతుల స్వావలంబన, ఉపాధి అవకాశాల పెంపు, విద్యా మరియు ఉద్యోగ అవసరాల కోసం రాకపోకలను సులభతరం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా మోటారు స్కూటర్లను పంపిణీ చేస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గురువారం నగరంలోని జడ్పీ కార్యాలయంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో మోటారు స్కూటర్లను లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విభిన్న ప్రతిభావంతులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. వాటిలో భాగంగానే ఉచిత మోటారు స్కూటర్ల పంపిణీ పథకాన్ని చేపట్టినట్లు వివరించారు. ఈ పథకం ద్వారా విద్య, ఉపాధి, స్వయం ఉపాధి మరియు ఇతర అవసరాల కోసం ప్రయాణించే విభిన్న ప్రతిభావంతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రవాణా ఇబ్బందులు తగ్గి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు సామాజిక, ఆర్థిక సాధికారత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో పదిమంది చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 1750 మందికి 100 శాతం సబ్సిడీతో 23 కోట్ల వ్యయంతో విభిన్న ప్రతిభావంతులకు మోటార్ స్కూటర్ల ను అందజేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 70 మంది విభిన్న ప్రతిభావంతులకు మోటార్ స్కూటర్ల ను అందజేశామన్నారు. అదేవిధంగా గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక కోటి 20 లక్షల సి ఎస్ ఆర్ నిధులతో దివ్యాంగులకు అవసరమైన మోటార్ స్కూటర్ల ను అందజేయడం జరిగిందన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తూ, వారి అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్లి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, సదరన్ సర్టిఫికెట్లను డివిజన్ వారీగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు అలాగే కేంద్రమంత్రి చొరవతో దివ్యాంగులకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల సంక్షేమ సంస్థ చైర్మన్ జి. నారాయణస్వామి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి కోటేశ్వరరావు, జడ్పీ చైర్మన్ హేన్రి క్రిస్టినా, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వెంకట రమణప్ప, జడ్పీ సీఈవో జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

# ఇనాం భూముల సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

### రైతులకు పూర్తి హక్కులు కల్పిస్తాం ఉన్నత స్థాయి సమావేశంలో హామీ



**విజయవాడ, పెన్ పవర్, జూలై 16 :** దశాబ్దాలుగా రైతులను వేధిస్తున్న ఇనాం, ఎస్టేట్ భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ అధ్యక్షతన గురువారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, సీసీఎల్ఏ జయలక్ష్మి, బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పర్చూరు నియోజకవర్గంలోని ఏదుబాడు, చెన్నుబోట్ల అగ్రహారం, వలపర్ల, జంగమాహేశ్వరపురం, లక్కవరం గ్రామాలతో పాటు అద్దంకి నియోజకవర్గంలోని పలు గ్రామాల ఇనాం, ఎస్టేట్ భూముల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారి డిమాండ్లపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రులు, అధికారులు మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఇనాం భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బాధిత రైతులకు పూర్తి భూ హక్కులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



**ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక చొరవ :** ఇనాం, ఎస్టేట్ భూముల సమస్య పరిష్కారానికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవ చూపారు. బాధిత రైతులను నేరుగా ఉన్నతాధికారులు, మంత్రులతో ముఖాముఖి సమావేశానికి తీసుకువచ్చి వారి సమస్యలను వివరించే అవకాశం కల్పించారు. రైతుల సమస్యలను అధికారులు ఓపికగా విని పరిష్కార మార్గాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుత ప్రభుత్వం చొరవతో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఇనాం భూముల సమస్యకు న్యాయమైన, శాశ్వత పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని బాధిత రైతులు వ్యక్తం చేశారు.

# కలెక్టర్ ప్రశంసలు అందుకున్న 'బే ఆఫ్ బాపట్ల' వెబ్‌సైట్ నమూనా

### రూపకల్పన చేసిన చీరాల సెయింట్ ఆన్స్ విద్యార్థిని




**బాపట్ల, పెన్ పవర్, జూలై 16:** బాపట్ల జిల్లా పర్యాటక, చారిత్రక, సాంస్కృతిక విశేషాలతో పాటు ప్రభుత్వ సేవలను ప్రజలకు ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందించిన 'బే ఆఫ్ బాపట్ల' వెబ్‌సైట్ నమూనా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ప్రశంసలు అందుకుంది. చీరాలలోని సెయింట్ ఆన్స్ కళాశాల సైబర్ సెక్యూరిటీ విద్యార్థిని విన్నకోట చాందిని శ్రీ రూపొందించిన ఈ వెబ్‌సైట్ నమూనాను కలెక్టర్ పరిశీలించి అభినందించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెబ్‌సైట్ రూపకల్పనతో పాటు అందులో పొందుపరిచిన పర్యాటక ప్రాంతాలు, చారిత్రక కట్టడాలు, ప్రముఖ ఆలయాలు, బీచ్‌లు, వసతి, రవాణా సౌకర్యాలు, అత్యవసర సంప్రదింపు నంబర్లు వంటి అంశాలను చాందిని శ్రీ వివరించారు. ప్రస్తుతం జిల్లా పరిపాలనలో వినియోగంలో ఉన్న 'స్వర్ణ బాపట్ల' పోర్టల్‌తో ఈ వెబ్‌సైట్‌ను అనుసంధానం చేయాలని కలెక్టర్ సూచించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ యశ్వంత్ పర్యవేక్షణలో వెబ్‌సైట్‌ను మరింత అభివృద్ధి చేసి, ఆగస్టు 15 నాటికి పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా పర్యాటకులు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు అవసరమైన సమాచారం ఒకే వేదికపై అందుబాటులోకి రావడంతో పాటు, పౌరులు తమ ఫిర్యాదులు, సూచనలను నేరుగా నమోదు చేసే సౌకర్యం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ సూచనల మేరకు నెల రోజుల్లో ఆధునిక సాంకేతికతతో వెబ్‌సైట్‌ను పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని చాందిని శ్రీ తెలిపారు. ఈ సందర్భంగా చాందిని శ్రీ తండ్రి విన్నకోట శ్రీనివాసరావు, తాతయ్య పి. సత్యనారాయణ, వేజండ్ల శ్రీనివాసరావు, స్నేహితులు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# చెప్పిన తేదీ ప్రకారమే శంకర్ విలాస్ ప్రారంభం చేస్తా : మంత్రి పెమ్మసాని






**గుంటూరు, పెన్ పవర్, జులై, 16 :** నగరంలో నిర్మిస్తున్న శంకర విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులను గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గారు స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ విలాస్ నిర్మాణ పనులతో పాటు స్థానిక శ్యామల నగర్ పనుల లో జరుగుతున్న జాప్యాన్ని కూడా ఈ సందర్భంగా పెమ్మసాని గారు వివరించే ప్రయత్నం చేశారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం అనుకున్న సమయంలోనే పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం .ఉన్న చిన్న చిన్న సమస్యలు అన్నిటిని పరిష్కరించుకుంటూ వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నాం. 2 - 3 పిల్లర్ల పనుల నిమిత్తం మిగిలిన అన్ని పనులు వేగంగా సాగుతున్నాయి మరికొన్ని గడ్డర్లు రావాల్సి ఉంది. రాబోయే ఏడాదిలో పనులన్నింటిని పూర్తిచేసి శంకర్ విలాస్ ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురాబోతున్నాం. అవసరాన్ని బట్టి లేబర్ ని కూడా పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నాం. గుంటూరు ప్రజల అదృష్టం బట్టి మన జిల్లాలో ఇన్ని ఆర్‌ఓబీలు నిర్మాణంచేయబోతున్నాం చేసుకునే అవకాశం దక్కింది. అవకాశానికి మించి కాంపెన్సేషన్ కూడా ఇస్తున్నాము. కానీ శ్యామల నగర్ వద్ద నిర్మాణానికిగానూ కొందరు ఆర్ఓబి వద్దు ఆర్ యూ బి కావాలని అడుగుతున్నారు. దయచేసి అందరూ సహకరిస్తేనే ఒక ప్రాజెక్టు పూర్తవుతుందని మర్చిపోవద్దని మనవి. శ్యామల నగర్ కు అందరూ ఒప్పుకుంటే అంగీకరిస్తే ల్యాండ్ అక్విజేషన్ కు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తాం.ముందుగా చెప్పిన డెడ్లైన్ ప్రకారం శంకర్ విలాస్ పనులను పూర్తి చేస్తాం. మెటీరియల్ అంశాలు గాని, మరిన్ని ఏ అంశాలు అయినా సరే అన్నింటినీ పరిష్కరించి నిర్ణీత సమయంలోనే నిర్మాణం పూర్తి చేస్తాం ఓవరాల్ గా వంతెన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి .ఈ సందర్భంగా ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని ఎవరు ఏం చెప్పినా నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం.ఈ పరిశీలనలో కార్యక్రమంలో లిప్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు , ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ , వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్ , డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు , మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్ , ర్ అండ్ బి స్ ఈ శ్రీనివాసమూర్తి , రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజనీర్ కాగ్ ఆర్డినేషన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకుల సహకారంతోనే సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతాయి : ప్రత్తిపాటి

### దేశంలోనే భారీ రుణ వితరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం : ఎంపీ లావు
### అర్హులకు రుణాలందించండలో బ్యాంకులు ఉదారంగా వ్యవహరించాలి : ప్రత్తిపాటి.
### ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా రూ.3,216 కోట్ల రుణాలను లబిధదారులకు అందించబోతున్నాం : ఎంపీ లావు.

**చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 16:** చిలకలూరిపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు...రాయితీ రుణాలపై అవగాహనతో పొదుపు సంఘాల మహిళలు, రైతులు తమకు నచ్చిన వ్యాపార, వ్యవసాయ రంగాల్లో రాణించి ఆర్థికంగా స్థిరపడవచ్చని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. బ్యాంకులు అందించే రాయితీ రుణాలు, ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. గురువారం చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిల్ హాల్లో నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలుతో కలిసి ఎమ్మెల్యే ప్రత్తిపాటి, శుక్రవారం నరసరావుపేట ఇండోర్ స్టేడియంలో జరిగే కేంద్రమంత్రి, ముఖ్యమంత్రులు పాల్గొనే క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ రుణ పంపిణీ కార్యక్రమం విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై, ఎమ్మెల్యే, ఎంపీ స్వయం సహాయ సంఘాల మహిళలు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ప్రత్తిపాటి, లావు విలేకరులతో మాట్లాడారు.





**బ్యాంకులు ఉదారంగా రుణాలిస్తేనే.. ఆర్థిక అసమానతలు తగ్గుతాయి: ప్రత్తిపాటి**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, రాయితీ రుణాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలన్న లక్ష్యంతో, బ్యాంకుల్ని సమాయత్తం చేసే దిశగా తొలిసారి నరసరావుపేటలో శుక్రవారం భారీ రుణ పంపిణీ కార్యక్రమం జరగబోతోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా రూ.3,200 కోట్లకు పైగా రుణాలను లబ్ధిదారులు స్వీకరించబోతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కూటమి శ్రేణులు, పొదుపు సంఘాల మహిళలు, అధికారులు సమన్వయం, అంకిత భావం, క్రమశిక్షణతో పనిచేయాలని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. కేంద్ర పథకాలు, వివిధ వర్గాలకు అందించే బీమా పథకాలపై మెప్మా, డ్వాక్రా విభాగాల మహిళలు ప్రజల్లో అవగాహన పెంచాలని ప్రత్తిపాటి సూచించారు. అలానే అర్హులైన వారికి, సిబిల్ బాగున్న వారికి ప్రభుత్వ, వ్యక్తిగత రుణాల పంపిణీలో బ్యాంకులు ఉదారంగా వ్యవహరించాలని, అప్పుడే దేశంలో ఆర్థిక అసమానతలు తగ్గిపోతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాల లక్ష్యాలకు అనుగుణంగా, బ్యాంకులు, ప్రైవేట్ సంస్థలు తమ నిబంధనలను సరళతరం చేయాలని ప్రత్తిపాటి ఈ సందర్భంగా సూచించారు.

**దేశంలోనే భారీ రుణ వితరణ కార్యక్రమం.. క్రెడిట్ అవుట్ రీచ్ : ఎంపీ లావు**

దేశంలో తొలిసారి వెనుకబడిన పల్నాడు జిల్లాలో భారీ రుణ వితరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, శుక్రవారం నరసరావుపేటలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు రూ.3,216 కోట్ల రుణ పంపిణీ జరగబోతోందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే రుణ వితరణ కార్యక్రమానికి దేశంలోని ప్రధాన బ్యాంకుల ఛైర్మన్లు కూడా హాజరవుతున్నారని ఆయన చెప్పారు. సామాన్యులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు బ్యాంకులు తమ సహాయ సహకారాలు అందిస్తున్నాయనే వాస్తవాన్ని ప్రజలకు తెలియచేయడానికే శుక్రవారం రూ.3,216 కోట్ల రుణాలను పంపిణ చేస్తున్నట్టు లావు తెలిపారు. తొలిసారి ఆర్.ఓ.ఎఫ్.ఆర్ పట్టాదారులైన గిరిజనులకు, గుర్తింపు కార్డులున్న కౌలురైతులకు కూడా రుణాలు పంపిణీ చేయబోతున్నట్టు ఆయన చెప్పారు. మండలానికో పారిశ్రామిక క్లస్టర్ చొప్పున తొలిసారి జిల్లాలో 28 క్లస్టర్లను రేపు ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి ప్రారంభించబోతున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, జనసేన నాయకులు మండలనేని చరణ్ తేజ్, మునీర్ హసన్, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, గట్టా హేమ, టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు, మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, షేక్ మస్తాన్ వలి, కొత్త కోటేశ్వరరావు, బేరింగ్ మౌలాలి, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, సి.యం.యం. పద్మజా, మూడు మండలాల ఎంపిడిఓ లు, సి.ఓ లు, వివిధ హోదాలలో ఉన్న అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పుటూరులో ప్రభుత్వ హోమియో వైద్యుడికి గ్రామస్థుడి అభినందన - స్టేషనరీ విరాళం



**ఉప్పుటూరు (బాపట్ల జిల్లా), పెన్ పవర్, జూలై 16:** ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాలలో ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్న వైద్యుడు డాక్టర్ దాసరి చంద్రశేఖర్‌ను గ్రామస్థుడు షేక్ బాజీ అభినందిస్తూ ఆసుపత్రికి స్టేషనరీ వస్తువులను విరాళంగా అందించారు. గ్రామస్తులతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు కూడా పని వేళలు ముగిసిన అనంతరం సైతం ఓర్పుతో, నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ సేవలకు ముగ్ధుడై ఈ విరాళం అందించినట్లు షేక్ బాజీ తెలిపారు. వైద్య సేవలతో పాటు ఆసుపత్రి నిర్వహణ పనులు మరింత సులభతరం కావాలనే ఉద్దేశంతో స్టేషనరీ సామగ్రిని అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు షేక్ బాజీ చేసిన సేవాభావాన్ని అభినందించారు. విరాళాన్ని స్వీకరించిన డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి గౌరవించిన గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉప్పుటూరులో నూతన ప్రభుత్వ హోమియో వైద్యశాల భవన నిర్మాణం త్వరితగతిన పూర్తవాలని, అందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ ఆసుపత్రి పూర్తయితే ఉప్పుటూరుతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు కూడా మెరుగైన హోమియో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆంధ్రప్రదేశ్‌ను ఆయుష్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యాన్ని ప్రకటించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆ దిశగా ఉప్పుటూరులో అత్యాధునిక హోమియో వైద్యశాల నిర్మాణానికి అందరూ సహకరించాలని డాక్టర్ చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు.

## పదో తరగతి విద్యార్థులకు హిందీ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్, జులై, 16:** పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించేలా వినూత్న కృషితో అధ్యయన పుస్తకాలను రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ.. విద్యాశాఖ అధికారులతో కలిసి గురువారం కలెక్టరేట్‌లో హిందీ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా ముఖ్యమైన అంశాలను సమగ్రంగా పొందుపరిచిన ఈ స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు ఈ స్టడీ మెటీరియల్‌ను కూడా క్రమం తప్పకుండా అభ్యసిస్తే హిందీ సబ్జెక్టులో మంచి మార్కులు సాధించడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు వినూత్న బోధనా పద్ధతులను అవలంబించడంతో పాటు ఇలాంటి నాణ్యమైన అధ్యయన సామగ్రిని రూపొందించడం అభినందనీయమన్నారు. ఈ స్టడీ మెటీరియల్‌లో ముఖ్యమైన ప్రశ్నలు, సమాధానాలు, వ్యాకరణ అంశాలు, పరీక్షా విధానానికి అనుగుణమైన సూచనలు పొందుపరిచినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త రమేష్ బాబు, జిల్లా ఉమ్మడి పరీక్షల మండలి కార్యదర్శి ఉమర్ అలీ, హిందీ రిసోర్స్ పర్సన్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన సిద్ధార్థ విద్యార్థినులు : వేల్పూరి నాగేశ్వరరావు



**భట్టిప్రోలు, పెన్ పవర్ జులై, 16:** షైనింగ్ స్టార్ అవార్డుకు తమ హైస్కూల్ విద్యార్థులు ఇరువురు ఎంపికయ్యారని మండల కేంద్రమైన భట్టిప్రోలు సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ వేల్పురి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 మార్చిలో జరిగిన ఎస్. ఎస్. సి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు ఆ ఇరువురు సాధించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డ్స్ కు ఎంపికైన పాఠశాల విద్యార్థినులు బొంతు జెస్సి(588) మార్కులు, పాలగంటి హిమబిందు(585) మార్కులు సాధించాలని నాగేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థినులను ధన్యవాదములు కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ వేల్పూరి నాగేశ్వరరావు, మరియు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## కరుణించిన వరుణుడు- కేరింతల తో చిన్నారులు



**భట్టిప్రోలు, పెన్ పవర్ జూలై 16 :** సకాలంలో వర్షాలు కురియకపోవటంతో రైతాంగం మండల వ్యాప్తంగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో వరుణుడి కోసం రైతన్నల బిడ్డలు బుధవారం చేసిన చిరు ప్రయత్నం కప్పా తల్లి నీలాడే కార్యక్రమం గురువారం విజయవంతం అయ్యింది. సాయంత్రానికి ఉరుములు, మెరుపులతో మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఒక్కసారి గా ఇంతకాలం గా వేడెక్కిన వాతావరణం చల్లబడింది. భక్తులు అందించిన సహకారం తో చిన్నారులు స్థానిక రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎట్టకేలకు వేడి తో ఊపిరి ఆడక ఇబ్బందులు ఎదుర్కొన్న వృద్ధులకు, చిన్నారులకు సేద తీర్చిన వరుణుడికి పలువురు ధన్యవాదములు తెలిపారు.

## డాక్టర్ ఎం. ఆదినారాయణ 20వ వర్ధంతి సభను జయప్రదం చేయండి




**పెన్ పవర్ కారంపూడి జూలై 16:- వెంకటేష్, పెనుగొండ్ల :** పేదలు, బడుగు బలహీన వర్గాలు, కార్మికుల సంక్షేమం కోసం జీవితాంతం సేవలందించిన దివంగత డాక్టర్ ఎం. ఆదినారాయణ 20వ వర్ధంతి సభను ఈ నెల 18వ తేదీ శనివారం కారంపూడిలోని డాక్టర్ ఆదినారాయణ స్థూపం వద్ద నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు, సీపీఐ నాయకులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా కారంపూడి ప్రజలు, కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, డాక్టర్ ఆదినారాయణ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. వర్ధంతి సభకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

# పేటలో గంజాయి స్మగ్లర్ అరెస్ట్

### పరారీలో ఉన్న పాత నేరస్థుడిని పట్టుకున్న పోలీసులు



**చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 16:** చిలకలూరిపేట : రూరల్ యువతను, విద్యార్థులను మత్తుకు బానిసలుగా చేస్తూ అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఓ పాత నేరస్థుడిని రూరల్ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గతంలో పలు హత్య, దోపిడీ కేసులతో పాటు గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నిందితుడిగా ఉన్న కర్లపాలేనికి చెందిన షేక్ హుస్సేన్ భాషా అలియాస్ బడే (29) ప్రస్తుతం చిలకలూరిపేట మండలం పోతవరంలో నివాసం ఉంటున్నాడు. గత జనవరి 21న గణపవరం గ్రామ పరిధిలో సుమారు 7.130 కిలోల గంజాయి విక్రయిస్తూ నలుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. వారిని విచారించగా, షేక్ హుస్సేన్ భాషా తమ వద్ద నుండి కిలో గంజాయిని రూ. 2000 లకు కొనుగోలు చేసి తీసుకువెళ్లినట్లు అంగీకరించారు. అప్పటి నుండి నాదెండ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు (సిఆర్. నెం.9/2026) నమోదు కాబడి నిందితుడు పరారీలో ఉన్నాడు. పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆదేశాలతో, నరసరావుపేట డీఎస్పీ ఎం.హనుమంతరావు పర్యవేక్షణలో చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పక్కా సమాచారంతో జూలై 15న గణపవరం మెయిన్ సెంటర్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించి నిందితుడిని పట్టుకున్న రూరల్ సీఐ సుబ్బానాయుడు, నాదెండ్ల ఎస్ఐ ఆర్.వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుళ్లు, మరియు సిబ్బందిని పల్నాడు జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీలు ప్రత్యేకంగా అభినందించారు.

## అనారోగ్యంతో ఉన్న టీడీపీ నాయకుడు పిక్కి నారాయణను పరామర్శించిన మహేంద్రనాథ్, గౌరీ అమర్నాథ్



**చీరాల, పెన్ పవర్, జూలై 16:** వాడరేవు తెలుగుదేశం పార్టీ నాయకుడు పిక్కి నారాయణ ఇటీవల అనారోగ్యానికి గురై అస్వస్థతకు లోనవడంతో, ఆయనను చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్, రాష్ట్ర యువ నాయకుడు మద్దులూరి గౌరీ అమర్నాథ్ గురువారం ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఈ సందర్భంగా పిక్కి నారాయణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వారు, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన వైద్య చికిత్స తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు.దఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గణపవరం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### రెండు పల్టీలు కొట్టిన కాలేజీ విద్యార్థుల కారు



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 16: నాదెండ్ల :** పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం కృష్ణగంగ స్పిన్నింగ్ మిల్ సమీపంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరిపేట నుంచి కాలేజీకి వెళ్తున్న విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు అతివేగంతో అదుపుతప్పి రోడ్డుపై ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు రెండు పల్టీలు కొట్టి రోడ్డు పక్కకు వెళ్లి పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు కాలేజీ విద్యార్థులకు గాయాలైనట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కారులో చిక్కుకున్న విద్యార్థులను బయటకు తీసి చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు

## కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం..!



**బంటుమిల్లి, పెన్ పవర్, జులై 16 :** బంటుమిల్లి మండలం చిన్నతుమ్మిడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కాగిత అమాలేశ్వరరావు, వేముల శివయ్య రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందగా, వారి కుటుంబాలకు పార్టీ ప్రమాద భీమా కింద రూ.5 లక్షల చొప్పున భీమా చెక్కులను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలైన బలం అని, వారి కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలవడం పార్టీ బాధ్యత అని అన్నారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని, పార్టీ కోసం సేవలందించిన కార్యకర్తలను ఎప్పటికీ మరచిపోదని పేర్కొన్నారు.అదే కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త త్రివిక్రమ్ మృతుల కుటుంబాలకు మానవతా దృక్పథంతో ఒక్కో కుటుంబానికి రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఆయన చేసిన ఈ సహాయాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అభినందిస్తూ, బాధిత కుటుంబాలకు ఇది మరింత ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. భీమా చెక్కులు, ఆర్థిక సాయం అందుకున్న కుటుంబ సభ్యులు తమ కష్టసమయంలో అండగా నిలిచిన తెలుగుదేశం పార్టీ నాయకత్వానికి, ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌కు, అలాగే వ్యాపారవేత్త త్రివిక్రమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మృతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వేరుశనగ పంటకు 'బెట్ట' నివారణ చర్యలు తప్పనిసరి : వ్యవసాయ అధికారులు

**బోయినవారిపాలెం, తోటవారిపాలెం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం**

**రైతులకు సాగు సూచనలు చేసిన ఎ.డి.ఎ డి. రత్నకుమారి, శాస్త్రవేత్త డా. కామాక్షి**

**చీరాల, పెన్ పవర్, జూలై 16 :** చీరాల మండల పరిధిలోని బోయినవారిపాలెం, తోటవారిపాలెం గ్రామాల్లో గురువారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి. రత్నకుమారి, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డా. కామాక్షి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు గ్రామాల్లోని వేరుశనగ పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంటల ఎదుగుదలపై రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వాతావరణంలో నెలకొన్న మార్పుల వల్ల వేరుశనగ పంట బెట్టకు గురయ్యే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాస్త్రవేత్త డా. కామాక్షి మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో వేరుశనగ పంట బెట్టను తట్టుకునే దశలో ఉందని, అయితే దిగుబడి సాధించాలంటే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఒక ఎకరా వేరుశనగ పంటపై 1 కిలో చొప్పున 19:19:19 (ఎన్:పీ:కే) ఎరువును నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. దీనివల్ల మొక్కలకు తక్షణ పోషకాలు అంది, ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే శక్తి లభిస్తుందని ఎ.డి.ఎ. రత్నకుమారి రైతులకు వివరించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి. నిర్మలాదేవి, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు గీత, నీలిమ, జ్యోతి మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## గంజాయి రవాణాదారులపై రూరల్ పోలీసుల కఠిన చర్యలు

### పీఐటీ ఎన్డీపీఎస్ చట్టం కింద నిందితుడి అరెస్ట్




**చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 16:** చిలకలూరిపేట : గంజాయి రవాణాపై పల్నాడు జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు నేతృత్వంలోని బృందం అక్రమ రవాణాదారులపై నిఘా తీవ్రతరం చేసింది. ఈ క్రమంలో, రెండు అంతకంటే ఎక్కువ కేసులు నమోదై సమాజానికి ముప్పుగా మారిన ముఠా సభ్యులను గుర్తించి, పీఐటీ ఎన్డీపీఎస్ - 1988 చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటోంది.

**రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు కి నిందితుడు :** ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా, గతంలో చల్లా గోపిపై చర్యలు తీసుకున్న పోలీసులు, తాజాగా కారసాని శివప్రసాద్ రెడ్డి (అలియాస్ ప్రసాదరెడ్డి) అనే గంజాయి విక్రయదారుడిని అరెస్ట్ చేశారు. ఇతనిపై నమోదైన నేర చరిత్రను పరిశీలించిన ప్రభుత్వం, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో డిటెన్షన్‌లో ఉంచాలని ఉత్తర్వులు జారీ చేసింది. జులై 15 న సీఐ బి. సుబ్బానాయుడు, రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిందితుడిని జైలుకు తరలించారు

## కేరళ రేంజ్ లో ఏపీలో 23 గ్రామాలు..!

విశాఖపట్టణం, జూలై 16, : ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ పాలనలో సరికొత్త మైలురాయిని అందుకుంది. రాష్ట్రంలోని 23 గ్రామ పంచాయతీలు తమ అద్భుతమైన సేవలు, పారదర్శక విధానాలకు గానూ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఐఎస్ఓ గుర్తింపును సొంతం చేసుకున్నాయి. స్థానిక సంస్థల పరిధిలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఈ విజయంతో సత్ఫలితాలను ఇచ్చాయని స్పష్టమవుతోంది. గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వ రికార్డులను పక్కాగా నిర్వహించడం, ప్రజలకు కావాల్సిన వివిధ రకాల ధృవపత్రాలను (సర్టిఫికెట్లు) ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన జారీ చేయడంలో ఈ 23 పంచాయతీలు విశేష ప్రతిభ కనబరిచాయి. కార్యాలయాల నిర్వహణలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడంతో పాటు, జవాబుదారీతనంతో కూడిన పాలనను అందించినందుకు గానూ ఈ ఐఎస్ఓ సర్టిఫికేషన్ లభించింది. ఈ అరుదైన గుర్తింపు సాధించిన గ్రామ పంచాయతీల సిబ్బందిని, అధికారులను ఏపీ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ ఐఏఎస్ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన సేవలందించడంలో సిబ్బంది చూపిన ప్రతిభను ఆయన కొనియాడారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో రాష్ట్రంలోని మరిన్ని గ్రామ పంచాయతీలు ఈ స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. స్థానిక స్వపరిపాలనలో దేశంలోనే ముందంజలో ఉన్న కేరళ రాష్ట్ర తరహాలోనే, ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాలను కూడా ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఏపీ పంచాయతీరాజ్ శాఖ గట్టి పట్టుదలతో ఉంది. అందులో భాగంగానే డిజిటలైజేషన్, వేగవంతమైన పౌర సేవలను విస్తృతం చేస్తూ, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని మరిన్ని గ్రామ పంచాయతీలకు కూడా ఐఎస్ఓ ప్రమాణాలు దక్కేలా అధికారులు ప్రత్యేక ప్రణాళికలతో కసరత్తు చేస్తున్నారు.

## ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు కార్యక్రమం : జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్, జులై, 16 :** శుక్రవారం తాడికొండ నియోజక వర్గం మేడికొండూరు మండలం పేరేచర్లలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. పేరేచర్ల జంక్షన్ వద్ద సాయిబాబా మందిరం ఎదురుగా ఉన్న సాయి కృష్ణ కళ్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. స్థానిక శాసన సభ్యులు, జిల్లా అధికారులు, నియోజకవర్గంలోని మండల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారులకు అందజేయవచ్చని జిల్లా కలెక్టర్ వివరించారు.

# చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

### ఆపద్బాంధవుడిగా జనసేన నాయకులు మండలనేని చరణ్ తేజ



**చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 16 :** చిలకలూరిపేట: పట్టణానికి చెందిన ఫోటోగ్రాఫర్ బొంత వెంకట్రావు కుమార్తె అమృత తీవ్ర అనారోగ్యానికి గురైన విషయం గుమ్మడి సైదులు చొరవతో తెలుసుకున్న జనసేన పార్టీ యువ నాయకుడు మండలనేని చరణ్ తేజ మానవత్వంతో వెంటనే స్పందించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తోట మల్లికార్జునరావు ద్వారా తెలుసుకున్న ఆయన, ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచారు. అమృత వైద్య ఖర్చుల నిమిత్తం తన వంతు బాధ్యతగా రూ.ఆర్థిక సాయాన్ని సీనియర్ ఫోటోగ్రాఫర్లు అన్నం బుల్లిబాబు, మల్లాల కోటేశ్వరరావు, మార్టూరు రమణ చేతుల మీదుగా అందజేసి తన సహృదయాన్ని, సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. కష్టకాలంలో ఉన్న వారిని ఆదుకోవడంలో చరణ్ తేజ చూపిన ఈ ఉదార స్వభావం పట్ల స్థానికులు, చిలకలూరిపేట ఫోటోగ్రాఫర్స్ మరియు పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నం పోతురాజు, ఉప్పాల కిరణ్, ఉదయ్, ఈశ్వర్ స్టూడియో వాసు, రాయల్ హరి, రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఎండుగుంపాలెం ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ





**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 16: నాదెండ్ల :** పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం గ్రామంలోని నూజెండ్లపల్లి అగ్రహారంలో ఉన్న శ్రీ సువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోని హుండీ తాళాన్ని ధ్వంసం చేసి, హుండీని పగులగొట్టి అందులోని నగదును అపహరించారు. నగదు తీసుకెళ్లిన అనంతరం ఖాళీ హుండీని సమీపంలోని పొలాల్లో పడేసి పరారయ్యారు. గురువారం ఉదయం ఆలయానికి వచ్చిన గ్రామస్థులు ఈ ఘటనను గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సంఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాలను సేకరించి, కేసు నమోదు చేసి దుండగుల కోసం దర్యాప్తు చేపట్టారు. ఆలయంలో చోరీ జరగడంతో గ్రామంలో ఆందోళన నెలకొంది. గ్రామస్థులు నిందితులను త్వరగా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరుతున్నారు.

# ఇడుపులపాడులో గ్రామసభ నిర్వహణ

### రెండు అర్జీలు స్వీకరణ : తహశీల్దారు ఏవీఎస్ శ్రీనివాస్



**ఇంకొల్లు, పెన్ పవర్, జూలై 16 :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఒక నెలలో ఒక గ్రామం -- నాలుగు వారాల పాటు పర్యటించడం' కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంకొల్లు మండలంలోని ఇడుపులపాడు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు తహశీల్దారు ఏవీఎస్ శ్రీనివాస్ అధ్యక్షత వహించి గ్రామస్థుల నుంచి రెవెన్యూ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం రెండు అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. అందిన వినతులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గ్రామస్థులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ప్రకాశం, ఝాన్సీ, భాగ్యరాజ్, ఆర్ఎస్‌డీటీలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# కడవకుదురులో మూడో గురువారం రెవెన్యూ సమస్యల ప్రత్యేక కార్యక్రమం

## విస్తీర్ణం సవరణకు మరో మూడు అర్జీల స్వీకరణ



**కడవకుదురు, పెన్ పవర్, జూలై 16:** ప్రజల రెవెన్యూ సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గురువారం కడవకుదురు గ్రామంలో మూడో గురువారం రెవెన్యూ సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో నిర్వహించిన రెండు గ్రామసభల్లో విస్తీర్ణం (ఎక్స్‌టెంట్) సవరణకు సంబంధించి అందిన తొమ్మిది అర్జీలపై సర్వే నిర్వహించేందుకు సంబంధిత నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విస్తీర్ణం సవరణకు సంబంధించి మరో మూడు అర్జీలు అందగా, వాటిని పరిశీలించి నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె. ప్రభాకరరావు, వీఆర్వో కె. నాగేశ్వరరావు, గ్రామ సర్వేయర్ జి. యశశ్వని తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# గుంటూరు వైద్యురాలి ఘనవిజయం

**డాక్టర్ పమిడిముక్కల విజయకు అంతర్జాతీయ గుర్తింపు**

**వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ డైరెక్టర్‌గా నియామకం**

**దక్షిణాది రాష్ట్రాల్లో మొట్టమొదటి వైద్యురాలిగా స్థానం**

**తండ్రిపేరుతో సేవా కార్యక్రమాలు**

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సీనియర్ న్యూరాలజిస్ట్, లలితా పీవీఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పమిడిముక్కల విజయ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కేవలం 18 మంది వైద్యులను మాత్రమే ఎంపిక చేసే వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్‌కు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా ఎంపికై రికార్డు సృష్టించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్‌కు ఎంపికైన మొట్టమొదటి వ్యక్తిగా డాక్టర్ విజయ రికార్డు సృష్టించారు. బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు అందిస్తున్న చికిత్సలకు, పక్షవాత బారిన పడకుండా ప్రజలకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలకు, బ్రెయిన్ స్ట్రోక్ చికిత్సల్లో వైద్యులు, సిబ్బందికి లలితా పీవీఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన అంకినీడు స్ట్రోక్ సెంటర్ ద్వారా అందిస్తున్న అత్యుతన్నత వైద్య ప్రమాణాలకు అంతర్జాతీయ గౌరవం లభించింది. తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలిగా ఆమె పనిచేసి రికార్డు సృష్టించారు.

**1996 నుంచి సేవలు :** ఉమ్మడి ఏపీలోనే మొట్టమొదటిగా, దేశంలో రెండవదిగా 1996లో గుంటూరులో అంకినీడు స్ట్రోక్ సెంటర్‌ను డాక్టర్ విజయ ఏర్పాటు చేశారు. పక్షవాత ( బ్రెయిన్ స్ట్రోక్) చికిత్సల్లో అత్యున్నత ప్రమాణాలు, నాణ్యమైన వైద్యసేవలు అందించటంలో అంకినీడు స్ట్రోక్ సెంటర్ చూపుతున్న నిరంతర కృషికి గాను ఇటీవల జాతీయ అవార్డు లభించింది. వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ ఏజెంల్స్ ఇనిస్టిట్యూట్ డైమండ్ స్టేటస్ అంతర్జాతీయ అవార్డు స్ట్రోక్ సెంటర్‌కు, డాక్టర్ విజయకు 2020 నుంచి 2025 వరకు వరుసగా ఐదుసార్లు లభించింది.

**తాత మరణం కలచివేసింది :** ఈ సందర్భంగా డాక్టర్ పి.విజయ 'సాక్షి'తో మాట్లాడుతూ నేను ఇంటర్ చదువుతున్న రోజుల్లో తాత అంకినీడుకు పక్షవాతం వచ్చి సకాలంలో చికిత్స ఎక్కడా లభించక చనిపోయారని, కళ్లెదుటే ఆయన మరణం చూసి తట్టుకోలేక బ్రెయిన్ స్ట్రోక్ మరణాలు నివారించాలని మనస్సులో గట్టిగా నిర్ణయించుకున్నానని తెలిపారు. తదనుగుణంగా న్యూరాలజిస్ట్‌గా సేవలు ప్రారంభించానని తెలిపారు. ఉమ్మడి ఏపీలోనే మొట్టమొదటిగా, దేశంలో రెండవదిగా మా తాత అంకినీడు పేరు మీదుగా 1996లో గుంటూరులో పక్షవాత మరణాలు నివారణే లక్ష్యంగా స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేశామన్నారు.

అంకినీడు స్ట్రోక్ సెంటర్ డైరక్టర్‌గా ఉన్న తాను ప్రతినెలా 100 నుంచి 125 మంది స్ట్రోక్ బాధితులకు చికిత్స అందిస్తూ ప్రాణాలు కాపాడుతున్నామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న వరల్డ్ స్ట్రోక్ అసోసియేషన్‌కు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా ఎంపికవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యటించి స్ట్రోక్ మరణాలు తగ్గింపే లక్ష్యంగా చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ఇచ్చిన పదవికి దేశానికి గుర్తింపు వచ్చేలా పనిచేస్తానని తెలిపారు. డాక్టర్ విజయ తన తండ్రి పమిడిముక్కల కుటుంబారావు పేరుతో 2006లో చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి వేలాది మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేస్తున్నారు. వేలాది ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు సేవలందిస్తున్నారు. వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అనేక సంస్థల్లో, గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు.

# వినుకొండలో పట్టపగలే చోరీలు

## ఒకే రోజు నాలుగు ఇళ్లలో చోరీ!

వినుకొండ: వినుకొండ పట్టణంలో గురువారం ఒకే రోజు నాలుగు ఇళ్లలో వరుస దొంగతనాలు జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. దొంగలు పట్టపగలే తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని బీరువాలు పగలగొట్టి, భారీగా నగదు, బంగారాన్ని దోచుకెళ్లారు. స్థానిక కొత్తపేట ఐదో లైను, ట్రాన్స్‌ఫార్మర్ బజారుతో పాటు, కాలువ కట్టపై ఉన్న రెడ్డి నగర్ సమీపంలోని మూడు ఇళ్లలో ఈ చోరీలు జరిగాయి. కొత్తపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆవుల సుబ్బారెడ్డి ఇంట్లోకి చొరబడిన దొంగలు, బీరువా తాళాలు పగలగొట్టి సుమారు పది తులాల బంగారం, లక్ష రూపాయల నగదును అపహరించుకుపోయారు.మరో మూడు ఇళ్లలోనూ దొంగలు అదే పద్ధతిలో తాళాలు, బీరువాలు పగలగొట్టి విలువైన వస్తువుల కోసం వెతికారు. ఇళ్లలోని సామాన్లను, బట్టలను గదుల నిండా చెల్లాచెదురుగా పడేశారు. ఆ ఇళ్లలో జరిగిన నష్టంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఒకే రోజు, అది కూడా పట్టపగలే నాలుగు ఇళ్లలో దొంగతనాలు జరగడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

**రంగంలోకి దిగిన పోలీసులు :** సమాచారం అందుకున్న వెంటనే వినుకొండ పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకున్నారు. దొంగతనం జరిగిన ఇళ్లను పరిశీలించి, వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దించి దర్యాప్తును ముమ్మరం చేశారు.

# అమ్మోనియా భద్రతపై అవగాహన

**కొరిటెపాడు(గుంటూరు):** జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలు, ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఫ్యాక్టరీల శాఖ ఆధ్వర్యంలో గురువారం గుంటూరు జీటీ రోడ్‌లోని టుబాకో అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు 81 ఫ్యాక్టరీల యాజమాన్యాలు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్‌లలో వినియోగించే అమ్మోనియా గ్యాస్ అత్యంత ప్రమాదకరమైనదని, అందువల్ల భద్రతా ప్రమాణాలను ఏ మాత్రం విస్మరించరాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా కంప్రెసర్ గదుల్లో ఉన్న అమ్మోనియా నిల్వ ట్యాంకులను బయట ఏర్పాటు చేయడం ద్వారా భారీ ప్రమాదాలను సమర్థంగా నివారించవచ్చని తెలిపారు. గ్యాస్ లీకేజీలు, పేలుళ్లు వంటి ప్రమాదాలు సంభవించకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**జీరో ప్రమాద మరణాలే లక్ష్యం :** కోల్డ్ స్టోరేజ్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్రబాబు మాట్లాడుతూ శివకుమార్ రెడ్డి చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, శిక్షణల వల్లే పరిశ్రమల యాజమాన్యాల్లో భద్రతపై స్పష్టమైన అవగాహన ఏర్పడిందని చెప్పారు. ఈ చైతన్యమే అమ్మోనియా ట్యాంకుల స్థాన మార్పుతో పాటు భద్రతా ప్రమాణాల అమలుకు దోహదపడిందన్నారు. సదస్సులో కోల్డ్ స్టోరేజ్ అసోసియేషన్ కార్యదర్శి రాఘవయ్య, అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక అధికారి కృష్ణారెడ్డి, కోకాకోలా, సంగం డెయిరీ, సిసిల్ సంస్థల సేఫ్టీ అధికారులు, వివిధ పరిశ్రమల యాజమాన్యాలు, భద్రతా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆస్తి వివాదంలో యువకుడు హత్య

**ఆటోలో ఉన్న కోటేశ్వరరావు మృతదేహం**

**తల్లిదండ్రులు, తమ్ముడే అంతమొందించారని ఆరోపణలు**

తెనాలిరూరల్: ఆస్తి వివాదం చినికి చినికి గాలివానగా మారి ఘర్షణకు దారితీసింది. వేధింపులతో విసిగి వేసారారో లేక తట్టుకోలేకపోయారో గానీ ఆ కుటుంబ సభ్యుల పరస్పర ఘర్షణలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో కలకలం రేపిన ఘటనపై పట్టణ వన్‌టౌన్ సీఐ సీహెచ్ రాంబాబు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక నాజరుపేటలో నివాసం ఉండి, ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించే కొల్లిపర కోటేశ్వరరావు(28)కు కొంతకాలంగా తల్లిదండ్రులతో ఆస్తి వివాదం జరుగుతోంది. కొల్లిపరలో ఉన్న నివేశన స్థలాన్ని అమ్మి తనకు కొంత డబ్బు ఇవ్వాల్సిందిగా తల్లిదండ్రులు భాస్కరరావు, విజయమ్మ, తమ్ముడు మరియదాసులపై కోటేశ్వరరావు ఒత్తిడి తెస్తుండడంతో పాటు తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి వరకు పరస్పరం వాదనలు, ఘర్షణ జరిగాయి. ఘర్షణలో తల్లిదండ్రులు సోదరుడు మరియదాసు చేతిలో తీవ్రంగా గాయపడిన కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మృతదేహాన్ని మూటలో పెట్టి ఆటోలో తరలించే ప్రయత్నం చేస్తుండగా స్థానికులు గమనించి డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐతో పాటు సిబ్బంది అక్కడికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేసి :** కోటేశ్వరరావు డబ్బు కోసం తల్లిదండ్రులను తీవ్రంగా వేధింపులకు గురి చేసేవాడని తెలుస్తోంది. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లి తెచ్చిన డబ్బును జల్సాల కోసం ఖర్చు చేసేవాడు. వివిధ రకాల పనులు చేసి తమ్ముడు కూడబెట్టిన సుమారు రూ.5 లక్షల వరకు సొమ్మునూ ఖర్చు చేశాడు. వేమూరు మండలం చదలవాడ గ్రామానికి చెందిన మహిళతో కోటేశ్వరరావుకు వివాహం కాగా ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. విభేదాల కారణంగా ఏడేళ్ల క్రితం భార్యతో విడిపోయాడు. కొందరు మహిళలతో లైంగిక సంబంధాలు ఏర్పరచుకుని కుటుంబ సభ్యుల సంపాదనంతా వారికి ఖర్చు చేస్తుండడంతో తండ్రి భాస్కరరావు, తల్లి విజయమ్మ నాజరుపేట ఇంద్ర టవర్స్ ఎదురుగా ఉన్న రేకుల షెడ్డుకు మకాం మార్చారు. వీరితో కలిసి ఉంటున్న కోటేశ్వరరావు ఆటో నడుపుతూ తన జల్సాలను మాత్రం మానుకోలేదు. డబ్బు కోసం తల్లిదండ్రులపై ఒత్తిడి తీవ్రతరం చేశాడు. భాస్కరరావు బుధవారం కొల్లిపర వెళ్లి తమ బంధువులతో ఇంటి స్థలం విక్రయించాలని, బేరం త్వరగా చూడాలని కోరి, తమ పెద్ద కొడుకు వేధింపులు భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. వేధింపులు తాళ లేక హతమార్చి ఉంటారని బంధువులు చెబుతున్నారు.

# దరియాహుస్సేన్ ఆత్మహత్య బాధాకరం

**ఆత్మహత్యకు కారకుడైన సీఐపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలి**

**వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జానీ**

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన షేక్ దరియా హుస్సేన్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ జానీ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన ఆత్మహత్యకు సీఐ శ్రీరామ్ వెంకట్రావు కారణమంటూ దరియా హుస్సేన్ మరణ వాంగ్మూల లేఖలో పేర్కొన్నారని, దరియా హుస్సేన్ ఆత్మహత్యకు కారకుడైన సీఐ శ్రీరామ్ వెంకట్రావు పై వెంటనే శాఖా పరమైన చర్యలు తీసుకోవాల న్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి మాట్లాడుతూ దరియా హుస్సేన్ ఆత్మహత్య చేసుకోవడానికి సీఐ శ్రీరామ్ వెంకటరావు కారణమని, సివిల్ కేసు కోర్టులో ఉండగా దరియా హుస్సేన్‌ను రోజు పోలీస్‌స్టేషన్‌కు పిలిచి చిత్రహింస లకు గురి చేశారన్నారు. చిత్రహింసలు తట్టుకోలేకనే దరియా హుస్సేన్ ఆత్మహత్య చేసుకున్నారన్నారు. సీఐ శ్రీరామ్ వెంకట్రావు పై శాఖాపరమైన చర్యలు తీసుకొని విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ షేక్ మాబూ హుస్సేన్, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గోర, మైనార్టీ సెల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ షేక్ ఖాసిం, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు షేక్ ముక్త్యార్, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ నాగూర్ బాషా, నాయకులు షేక్ మహిబ్, అలీ ఆజాం, తదితరులు ఉన్నారు.

# కోవిడ్ కేసులపై భయపడాల్సిన పనిలేదు

మంగళగిరి రూరల్: మంగళగిరిలోని అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో కోవిడ్ కేసు నమోదయిందంటూ సోషల్ మీడియాలో వార్త వైరల్ అయిన విషయంపై ఎయిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ రాకేష్ గురువారం స్పందించారు. కోవిడ్ కేసులపై ఎవరూ భయపడాల్సిన పనిలేదని, ఎయిమ్స్‌లో ఎవరూ కోవిడ్ ట్రీట్మెంట్ తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ముందు జాగ్రత్తగా ఔట్ పేషెంట్ విభాగంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, ఇద్దరు డాక్టర్లను ప్రత్యేకంగా నియమించామన్నారు. కోవిడ్ రోగుల కోసం ముందస్తు జాగ్రత్త చర్యగా 10 బెడ్లతో సపరేటు వార్డు ఏర్పాటు చేశామని తెలిపారు.

# మెడికల్ కాలేజీ హాస్టల్‌లో టేబుల్ టెన్నిస్ కోర్టు ప్రారంభం

గుంటూరు మెడికల్: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు గుంటూరు వైద్య కళాశాల మెన్స్ హాస్టల్‌లో టేబుల్ టెన్నిస్ కోర్టును ప్రారంభిస్తున్నట్లు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి చెప్పారు. గురువారం అమరావతి రోడ్డులోని మెన్స్ మెడికల్ హాస్టల్‌లో రూ. 2.50 లక్షలతో ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ పరికరాలను ఆయన ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శివగోపాల్, ఫిజికల్ డైరెక్టర్ అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఇవేమి జ్వరాలు బాబోయ్!

**శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం**

**జ్వరాలతో అల్లాడుతున్న గుంటూరు నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ విజృంభిస్తున్న వైనం**

**ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండని వైద్యులు**

**కిటకిటలాడుతున్న గుంటూరు జీజీహెచ్**

గుంటూరు మెడికల్: ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్ జ్వర బాధితులతో కిక్కిరిసిపోతోంది. గుంటూరు నగరంతో పాటు రూరల్ ఇతర గ్రామీణ ప్రాంతాల వారు కూడా పలు రకాల జ్వరాలతో ఆస్పత్రిబాట పడుతున్నారు. అయినా ఆరోగ్య శాఖ చోద్యం చూస్తూ జ్వర నివారణ చర్యలపై శీతకన్ను వేసింది. పేదలకు ఈ వైద్యశాలే దిక్కు కాగా.. ఆర్థికంగా ఫర్వాలేదు అనుకున్న వారు మాత్రం ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

**జిల్లాలో 1717 ఫీవర్ కేసులు :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ అధికారిక లెక్కల ప్రకారం జనవరి నుంచి ఇప్పటి వరకు 1717 ఫీవర్ కేసులు నమోదయ్యాయి. వీటిల్లో 27 డెంగీ కేసులు కాగా, 1200 టైఫాయిడ్ కేసులు, ఐదు మలేరియా కేసులు, మిగితావి సాధారణ జ్వరాలుగా నమోదయ్యాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడం శోచనీయం. దీంతో జీజీహెచ్‌తో పాటు నగరంలోని ప్రైవేటు వైద్యశాలల్లో జ్వరపీడితులు సాంత్వన పొందుతున్నారు.

**మలేరియా నిధులు ఎటు పోతున్నట్లో..?**

దోమల నియంత్రణ కోసం జిల్లా మలేరియా విభాగానికి ప్రత్యేక నిధులు వస్తుంటాయి. అయితే వాటిని ఎక్కడ, ఎంత ఖర్చు చేస్తున్నారో ఎవరికీ సమాచారం ఉండటం లేదు. ప్రతి ఏడాది జిల్లాలో డెంగీ, మలేరియా వంటి జ్వరాలు దోమల వల్లే అధికంగా వ్యాపిస్తున్నాయి. మలేరియా విభాగంలో ప్రత్యేక సిబ్బంది ఉన్నప్పటికీ జ్వర కేసుల వివరాల సేకరణ, జ్వరాల నియంత్రణ వంటి కార్యక్రమాలు చేస్తున్న దాఖలాలు పెద్దగా ఉండవు. జిల్లా మలేరియా అధికారి ఎప్పుడు కార్యాలయంలో అందుబాటులో ఉండరన్న ఆరోపణలున్నాయి. ప్రతిరోజూ కార్యాలయంలో ఉండకుండా సొంత పనులు చక్కదిద్దుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అసలు అధికారే ఇలా ఉంటే సిబ్బంది ఎందుకు సక్రమంగా విధులు నిర్వహిస్తారని అంతా ప్రశ్నిస్తున్నారు.

**వివరాల సేకరణలో విఫలం :** పెద్ద ఎత్తున జ్వరాల కేసులు నమోదు అవుతున్నా వివరాలు సేకరించడంలో వైద్యారోగ్య శాఖ పూర్తిగా విఫలం అయింది. సిబ్బంది వెళ్లి తనిఖీ చేయాల్సిన నిబంధనలకు పాతర వేశారు. ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు కూడా జ్వరాలతో చికిత్స పొందుతున్న వారి వివరాలు, డీఎంహెచ్‌ఓ కార్యాలయం అధికారులకు తెలియజేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు డెంగీ మాసోత్సవాలు, మలేరియా మాసోత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రతి శుక్రవారం ఏఎన్ఎం, ఇతర వైద్య సిబ్బందికి గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా జ్వరాలను ఏవిధంగా గుర్తించి, చికిత్స అందించాలనే విషయాలపై తరచూ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. **- డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ**

# దరియా హుస్సేన్ కుటుంబానికి పరామర్శ

పిడుగురాళ్ల: పోలీసుల వేధింపులకు తాళలేక ఆత్మహత్య చేసుకున్న దరియా హుస్సేన్ కుటుంబాన్ని గురువారం ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ చైర్మన్, మైనార్టీ హక్కుల పరిరక్షణ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ మహ్మద్ ఫారూ్క షబ్లీ పరామర్శించారు. దరియా హుస్సేన్ భార్య అమిరుషా బేగం, కుమారులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా కుటుంబాన్ని ఆదుకుంటామని, అండగా ఉంటామని ఆయన చెప్పారు. ఆయన వెంట ముస్లిం పెద్దలు పలువురు పాల్గొన్నారు.

# దరియా హుస్సేన్ ఆత్మహత్యపై కేసు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో షేక్ దరియా హుస్సేన్ పోలీసుల వేధింపులకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం అయింది. అయితే ఈ కేసులో దరియా వలి భార్య అమిరునిషాబేగం ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. అమిరునిషా బేగంకు ఇల్లు అమ్మిన పులుకూరి లక్ష్మి, ప్రశాంత్‌ల వేధింపులతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదు చేయటంతో దాచేపల్లి సీఐ ఖాజావలి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ ఎం. మోహన్‌తెలిపారు.

# పాత శివాలయం పునర్నిర్మాణానికి రూ.15లక్షలు మంజూరు

రెంటచింతల: పూర్వీకులు నిర్మించిన ఆలయాలు మన చరిత్రకు సజీవ సాక్ష్యాలని పల్నాడు జిల్లా దేవదాయ శాఖ అధికారి జీవీవీ శ్రీనివాసు అన్నారు. గురువారం తుమృకోట గ్రామంలోని పాత శివాలయం పునర్నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరైన రూ. 15 లక్షల చెక్కును ఆయన ఆలయ కమిటీ వారికి అందజేసి మాట్లాడారు. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పాలించిన తుమృకోట గ్రామంలో సుమారు 400 సంవత్సరాల చరిత్ర కిందట నిర్మించిన పాత శివాలయం శిథిలమైనట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుల కృషి మేరకు రూ. 15 లక్షల నిధులను టీటీడీ శ్రీ వాణి ట్రస్ట్ మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. మండల దేవదాయ శాఖ అధికారి గాదె రామిరెడ్డి, ఆలయ అధ్యక్షుడు జంగాల వెంకటే శ్వర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 19న టెట్ తెలుగు సబ్జెక్టుపై అవగాహన తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: టెట్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఇన్ సర్వీసు ఉపాధ్యాయుల ప్రయోజనార్థం ఈనెల 19న గుంటూరులోని ఏసీ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి తెలుగు సబ్జెక్టుపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ తెలిపారు. గురువారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అవగాహన తరగతుల పోస్టర్ విడుదల చేశారు. నెల్లూరుకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు ఆర్.వెంకట్రావు తరగతులు బోధిస్తారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పాల్గొని జిల్లాల విభజనపై తాజా సమాచారాన్ని తెలియజేస్తారని పేర్కొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, బి.ప్రసాద్, కె.రంగారావు, కె.కేదార్‌నాథ్, శ్రీధర్ పాల్గొన్నారు.

# 'జగన్ గేమ్ ఛేంజర్.. చంద్రబాబు నేమ్ ఛేంజర్'




చేనేత కార్మికుల సంక్షేమంలో వైఎస్ జగన్ ప్రభుత్వం గేమ్ ఛేంజర్‌గా నిలిస్తే, చంద్రబాబు ప్రభుత్వం పేర్లు మార్చడానికే పరిమితమైన "నేమ్ ఛేంజర్"గా మిగిలిపోయిందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. జగన్ హయాంలో ఐదేళ్ల పాటు నిరంతరంగా అమలైన వైఎస్సార్ నేతన్న నేస్తం పథకానికి పేరు మార్చి, లబ్ధిదారుల సంఖ్యను తగ్గించి, రెండేళ్ల ఆలస్యంగా అమలు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం చేనేత కుటుంబాలను తీవ్రంగా నిరాశపరిచిందని ధ్వజమెత్తారు. ప్రెస్‌మీట్‌లో రమేష్ యాదవ్ ఏమన్నారంటే..

**గత ప్రభుత్వంలో ఐదేళ్లు నిర్విరామంగా నేతన్న నేస్తం :** వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచే వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రారంభించి ఐదేళ్ల పాటు ప్రతి ఏడాది రూ.24 వేల చొప్పున సుమారు 80 వేలకుపైగా చేనేత కుటుంబాలకు అందించింది. ఒక్కో కుటుంబానికి మొత్తం రూ.1.20 లక్షలు చేరేలా చేసి, ఐదేళ్లలో సుమారు రూ.970 కోట్లను వెచ్చించి చేనేత కుటుంబాలకు అండగా నిలిచింది. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఈ పథకం అమలు ఆగలేదు

**పేరు మార్చి నేతన్నలకు వెన్నుపోటు :** చంద్రబాబు ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం పేరును 'నేతన్న భరోసా'గా మార్చడమే తప్ప కొత్తగా చేసింది ఏమీ లేదు. 2025 ఆగస్టు 7న రూ.25 వేల ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి, రెండేళ్ల పాటు అమలు చేయకుండా ఆలస్యం చేశారు. చివరకు కేవలం రూ.1,000 మాత్రమే పెంచి, 80 వేలకుపైగా ఉన్న లబ్ధిదారులను 54 వేలకే పరిమితం చేసి సుమారు 30 వేల మంది నేతన్నలను ఈ పథకం పరిధి నుంచి తప్పించింది.

**ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున వెంటనే చెల్లించాలి :** నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే 2024-25, 2025-26 సంవత్సరాలకు సంబంధించిన బకాయిలతో కలిపి అర్హులైన 80 వేలకుపైగా నేతన్నలందరికీ ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున వెంటనే చెల్లించాలి. పేర్లు మార్చడం కాదు.. వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన స్థాయిలో సంక్షేమాన్ని కొనసాగించగలిగితేనే చేనేత కుటుంబాలకు నిజమైన న్యాయం చేసినట్టవుతుంది అని రమేష్ యాదవ్ పేర్కొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం సీజ్

మైలవరం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మైలవరం పోలీసులు గురువారం తెల్లవారు జామున స్వాధీనం చేసుకున్నారు. లకి రెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వై జంక్షన్, ఆల్ఫా సెంటర్ మధ్య పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఓ లారీలో నాలుగు టన్నుల రేషన్ బియ్యం నిల్వలను గుర్తించారు. ఈ బియ్యాన్ని కర్నాటి సాయి బావులపాడు మండలం, లింగన్నగూడెం నుంచి కొనుగోలు చేసి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఎర్రుబాలెం మండలానికి తరలిస్తున్నారని లారీ డ్రైవర్ సమాచారం మేరకు పోలీసులు గుర్తించారు. సివిల్ సప్లయిస్ డెప్యూటీ తహసీల్దారు సమక్షంలో పంచనామా నిర్వహించి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద భద్రపరిచారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్ తాతినేని అనిల్‌ను అరెస్టు చేసి, బియ్యం సేకరించిన కర్నాటి సాయి, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. కర్నాటి సాయి పరారీలో ఉన్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

# తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం

### సమన్వయంతో సమస్యల పరిష్కారం..
### స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

**చిలకలపూడి(మచిలీపట్నం):** గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించి సక్రమంగా సరఫరా చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. జిల్లా ప్రజా పరిషత్ కన్వెన్షన్ హాలులో గురువారం 1వ స్థాయీ సంఘం (ప్లానింగ్, ఆర్థికం), 7వ స్థాయీ సంఘం (పనులు) సమావేశాలు చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగాయి. ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించిన పరిపాలనా అనుమతుల మంజూరు, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే అనుమతులు పొందిన పనులను వెంటనే ప్రారంభించి, ప్రస్తుత పదవీకాలం ముగిసేలోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరం ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఈ నెల 24 నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. వచ్చే సాధారణ సర్వసభ్య సమావేశాన్ని అక్కడే నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి :** విజయవాడలో ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి కొత్త సమావేశ మందిరం, చాంబర్ ఏర్పాట్లు కూడా తుది దశకు చేరుకున్నాయని హారిక చెప్పారు. జిల్లా పరిషత్‌కు చెందిన భూముల్లో కొబ్బరి, కోకో, జీడిమామిడి, క్యాజూరినా వంటి వాణిజ్య పంటల సాగు ద్వారా ఆదాయం పెరగడంతో పాటు భూముల ఆక్రమణలను కూడా నివారించవచ్చన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా సంతృప్తి స్థాయిలో (సాచ్యురేషన్ మోడ్) తాగునీటి సరఫరా కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో నాణ్యమైన తాగునీరు అందేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జెడ్పీ సీఈవో జె. అరుణ మాట్లాడుతూ స్థాయి సంఘ సమావేశం ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలను రూపొందించుకునే విధంగా ఉండాలన్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయం పెంపొందించి ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థాయీ సంఘాల ఆమోదంతో తీసుకున్న అంశాలను రాబోయే సర్వసభ్య సమావేశంలో ఆమోదానికి ఉంచనున్నట్లు తెలిపారు. సమావేశంలో డెప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, ఉమ్మడి కృష్ణాజిల్లా అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బుక్ ఫెస్టివల్ బాబ్జీ అస్తమయం

### బుక్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపకుల్లో ఒకరిగా ప్రధాన భూమిక అధ్యక్షుడు, గౌరవాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన వైనం పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించనున్న కుటుంబ సభ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ పబ్లిషర్, విజయవాడ పుస్తకమహోత్సవ సంఘం పూర్వ అధ్యక్షుడు బెల్లపు బాబ్జీ (78) గురువారం ఉదయం తుది శ్వాస విడిచారు. కొద్ది కాలంగా ఆయన కాలేయ సంబంధ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన పార్థివ దేహాన్ని రామవరప్పాడు సమీ పంలో వైఎస్ఎల్‌వీ అమరావతీ గ్రాండ్--1లోని స్వగృహంలో ఉంచారు. వైద్య విద్యార్థుల ఉపయోగార్థం ఆయుష్ మెడికల్ కళాశాల ఆసుపత్రికి బాబ్జి పార్థివ దేహాన్ని శుక్రవారం అప్పగించనున్నారు. బాబ్జీకి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీకి 2015--16, 2016--17 కాలంలో రెండు సార్లు అధ్యక్షుడిగా సేవలు అందించారు. 2018 నుంచి 2024 వరకూ గౌరవాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. పుస్తక మహోత్సవం స్వరాజ్యమైదానం నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ మైదానానికి, అక్కడి నుంచి ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియానికి మారిన సందర్భాల్లో ప్రదర్శనను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

**ప్రచురణ కర్తగా :** బెల్లపు బాబ్జీ 1948 ఫిబ్రవరి ఒకటో తేదీన కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా, దోసపాడు గ్రామ సమీపంలోని రావులపాడులో రైతు బెల్లపు వేణు గోపాలరావు, వెంకటేశ్వరమ్మ దంపతులకు జన్మించారు. ఆయన పెద్ద తండ్రి వెంకట్రామయ్య విశాలాంధ్ర సంస్థలో పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆ క్రమంలో ఆయన చొరవతో విజయవాడకు వచ్చిన బాబ్జీ కొద్ది రోజులు ఆయనతో కలిసి అడుగులు వేశారు. అనంతరం 1968లో స్టూడెంట్ బుక్ సెంటర్ అనే ప్రచురణ సంస్థను స్థాపించారు. అప్పటి నుంచి పాఠ్యపుస్తకాలు, పలు ప్రముఖ ప్రచురణ సంస్థల పుస్తకాలను విక్రయిస్తూనే తమ సంస్థ పేరు మీద ప్రముఖ రచయితల రచనలను ప్రచురించారు. వాసిరెడ్డి సీతాదేవి వంటి ప్రముఖుల రచనలతో పాటుగా బాపు, బాలి వంటి ప్రముఖుల చిత్రాలతో కూడిన పుస్తకాలను పాఠకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

**బుక్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపక సభ్యుడిగా :** నేషనల్ బుక్ ట్రస్ట్ సహకారంతో 1989లో విజయవాడలో తొలి సారిగా పుస్తక మహోత్సవాన్ని ఏర్పాటు చేయగా బాబ్జీ దానిలో కీలక పాత్ర పోషించారు. నగరంలోని పుస్తక ప్రచురణకర్తలు 1990లో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వ్యవస్థాపక సభ్యుడిగా ఆయన కీలక భూమిక పోషించారు. అప్పటి నుంచి 35 సంవత్సరాల పాటు విజయవాడ పుస్తక మహోత్సవం విజయవంతమయ్యేలా కృషి చేశారు. ప్రచురణకర్తల మధ్య సమ న్వయం, అతిథులతో కార్యక్రమాల రూపకల్పనలో ఆయనదే కీలక పాత్ర. బాబ్జీ పార్థివ దేహం వద్ద పలువురు ప్రముఖులు నివాళు లర్పించారు. బాబ్జీ మరణం సొసైటీకి తీరని లోటుని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు టి.మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. పలు సంస్థల నిర్వాహకులు, బాధ్యులు, సాహితీవేత్తలు, జర్నలిస్టు సంఘాల బాధ్యులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

# కదలివచ్చాయ్..జగన్నాథ రథచక్రాలు

కృష్ణా నదీ తీరాన... వేంకటేశ్వరుడి చెంత.. చల్లని సాయంత్రంవేళ.. జగన్నాథుని రథయాత్ర అత్యంత వైభవంగా సాగింది. భక్తుల జగన్నాథస్వామి నామస్మరణతో పరిసర ప్రాంతాలు మారుమోగాయి. గురువారం సాయంత్రం వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రారంభమై... రాయపూడిలోని సీఆర్డీఏ కార్యాలయం వద్ద రాత్రి 10.05 గంటలకు ముగిసింది. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతుండగా.. రథం మీద జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర, సుదర్శన్ కొలువుదీరగా భక్తులు నినదిస్తూ రథాన్ని ముందుకు లాగారు. శుభసూచికంగా వర్షం పడడంతో వాతావరణం ఒక్కసారిగా ఆహ్లాదకరంగా మారింది. అమరావతిలో తొలి జగన్నాథ రథయాత్రతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. వెంకటపాలెంలో మొదలైన రథయాత్ర సీడ్‌యాక్సెస్ రోడ్డులో కొనసాగింది. మొత్తం 9చోట్ల స్టేజీలు ఏర్పాటు చేసి ఒక్కోచోట మూడు గ్రామాలవారికి కేటాయించారు. రథం చేరుకున్నప్పుడు సంబంధిత గ్రామాల తరఫున జగన్నాథస్వామి తెచ్చిన సారె సమర్పించారు. హారతులిచ్చి భక్తులకు ప్రసాదాలు అందించారు. సీఆర్డీఏ కార్యాలయం వద్ద యాత్ర ముగిసింది. అక్కడ భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.

సంప్రదాయ వస్త్రధారణలో సీఎం.. రథయాత్రకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంప్రదాయ పంచెకట్టులో హాజరయ్యారు. ఆయనకు హరేకృష్ణ గోకులక్షేత్రం ప్రతినిధులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేదాశీర్వాదం అందించి స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు. వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సంప్రదాయ పూజలు చేసి తాడు లాగి రథయాత్ర ప్రారంభించారు. చంద్రబాబు రథం ముందు చీపురుతో శుభ్రం చేసి.. హారతి ఇచ్చారు. సాష్టాంగ నమస్కారం చేశారు. భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల వారికి పూలమాల వేసి జ్యోతి వెలిగించారు. అక్షయపాత్ర ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ మధుపండిట్ దాసా మాట్లాడుతూ.. అమరావతిలో తొలిసారి రథయాత్ర చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఏటా సంప్రదాయంగా నిర్వహిస్తామని చెప్పారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, జిల్లా తెదేపా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, కలెక్టర్ సాయికాంత్‌వర్మ, ఎస్పీ వకుల్‌జిందాల్ పాల్గొన్నారు.

ఇస్కాన్ సేవలు అమోఘం.. 'ఆధ్యాత్మిక విలువలు, నిస్వార్థ సేవ విషయంలో ఇస్కాన్, అక్షయపాత్ర గొప్ప పాత్ర పోషిస్తున్నాయి. దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో 25 వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల్లో ఆహారం అందిస్తోంది. 25 ఏళ్లలో 500 కోట్లమందికి ఆహారం అందించింది. నిత్యం 23 లక్షల మందికి ప్రభుత్వ సహకారంతో పోషకాహారం ఇస్తోంది.

# లెక్కలు తేలుస్తూ.. పోయినోళ్లను తొలగిస్తూ..!



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువు 24 వరకు పొడిగించడంతో క్షేత్రస్థాయిలో ఇంకా సేకరించని ఎన్యూమరేషన్ ఫారాలపై ప్రత్యేక దృష్టిసారించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడెక్కడ ఫారాలు సేకరించాల్సి ఉంది.. ఎంత మంది ఓటర్లు చనిపోయారు.. ఎంత మంది షిఫ్ట్ అయ్యారు. తదితర వివరాలతో సిబ్బంది ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. అందుకనుగుణంగా తగు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా మృతుల ఓట్లకు సంబంధించి మరణ ధ్రువీకరణ పత్రాల సేకరణ ప్రక్రియ చేపట్టారు.

**ధ్రువీకరణ పత్రం లేకుంటే పంచనామా :** చాలామంది చనిపోయిన వ్యక్తులు మరణ ధ్రువీకరణ పత్రాలు లేవని చెప్పడం, కొందరు పోయాయని చెప్పడంతో లక్ష్యసాధనకు ఆటంకంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎన్నికల సంఘం ఇచ్చిన మార్గదర్శకాల్లో పంచనామా చేసి సంబంధిత పత్రాన్ని సమర్పింవచ్చని ఉండటంతో ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు సిబ్బందిని ఆదేశించారు. చనిపోయిన వ్యక్తి తాలూకా కుటుంబ సభ్యుల సంతకాలతోపాటు సంబంధిత పత్రంలో ఆ ఇంటి చుట్టుపక్కల ఉన్న ఐదుగురి వ్యక్తుల సంతకాలతోపాటు ఆధార్ కార్డు లాంటి గుర్తింపు పత్రాలు సేకరించే దిశగా బీఎల్వోలు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు కూడా ఎవరికి వారు తమ కుటుంబంలో ఎవరైనా మృతిచెందితే వారి వివరాలు బీఎల్వోలకు తెలియజేయడంతోపాటు మరణ ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన అందించి సహకరించాలని కోరుతున్నారు.

**జిల్లాలో 54,563 మంది మృతులు :** జిల్లా వ్యాప్తంగా సేకరించాల్సిన ఫారాల గురించి ఆరా తీయగా, మొత్తం 54,563 మంది మృతులు ఉన్నట్లు లెక్క తేలింది. మృతుల్లో పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో ఎక్కువ మంది ఉండగా ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటినీ సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించే క్రమంలో చనిపోయిన ఓటర్లు ఉంటే వారి మరణ ధ్రువీకరణ పత్రాన్ని కుటుంబ సభ్యులు ఇవ్వాల్సి ఉంది. చాలా మంది వాటిని దాఖలు చేయకపోవడం ఇబ్బందికరంగా మారిందని సిబ్బంది చెబుతున్నారు.

# జిల్లాలో మూడు కొవిడ్ కేసులు

గుంటూరు జిల్లాలో తాజాగా మూడు కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్టు వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. మంగళగిరి ప్రాంతంలోని ఇద్దరు మహిళలతోపాటు, కృష్ణా జిల్లాకు చెందిన ఒక వృద్ధురాలికి ఈ వైరస్ సోకినట్టు అధికారులు నిర్ధారించారు. మంగళగిరి పరిధిలోని బాపనయ్యనగర్, నవులూరు ప్రాంతాలకు చెందిన మహిళల్లో ఒకరిది కేరళ రాష్ట్రం. గత నాలుగేళ్లుగా ఆమె మంగళగిరిలోనే నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం స్థిరంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు. కృష్ణా జిల్లాకు చెందిన వృద్ధురాలికి ఇతర దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉండడంతో ముందు జాగ్రత్త చర్యగా మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. వీరికి వైరస్ ఎక్కడ సోకింది? ఇటీవల ఏమైనా ప్రయాణాలు చేశారా? అన్న కోణంలో విచారణ చేస్తున్నారు. జీనోమ్ సీక్వెన్సింగ్‌కు నమూనాలు.. అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ కేసులు నమోదైన ప్రాంతాల్లో బాధితుల కుటుంబ సభ్యులకు కొవిడ్ నిర్ధారణ పరీక్షలు ముమ్మరం చేసింది. వ్యాధి నిర్ధారణ, నివారణకు అన్ని చర్యలు తీసుకున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. వైరస్ రకాన్ని గుర్తించేందుకు బాధితుల నుంచి సేకరించిన నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పుణెలోని జాతీయ వైరాలజీ ల్యాబ్‌కు పంపినట్టు వివరించారు. కలెక్టర్ సాయికాంత్‌వర్మ పరిస్థితిని ఎప్పటికప్పుడు స్వయంగా సమీక్షిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ర్యాపిడ్ పరీక్ష కిట్లు మరిన్ని అందుబాటులో ఉండేలా దృష్టి పెట్టినట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ తెలిపారు.

# దుర్గమ్మ సేవలో హీరో అల్లరి నరేష్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హీరో అల్లరి నరేష్ గురువారం దర్శించుకున్నారు. దుర్గాఘాట్, వీఐపీ ఘాట్‌తో పాటు కేఆర్ మార్కెట్, ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ మార్గంలో గత నాలుగు రోజులుగా ఆయన సినిమా షూటింగ్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం ఇంద్రకీలాద్రికి చేరుకున్న అల్లరి నరేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను నరేష్‌కు అందించారు. 1980లో విజయవాడలో దుర్గమ్మ రిక్షాలో ప్రయాణించి సినిమాకు వెళ్లిన కథ ఇతివృత్తంగా సినిమా నిర్మాణం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

# దుర్గమ్మకు పలువురి విరాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గురువారం పలువురు భక్తులు విరాళాలను సమర్పించారు. ఎన్టీఆర్ జిల్లా పెద ఓగిరాలకు చెందిన గుంటక దుర్గాప్రసాద్‌రెడ్డి, ఇంద్రజ దంపతులు అమ్మవారి ఉచిత ప్రసాద వితరణకు రూ. 1,11,111, గుంటూరు ఎస్‌వీఎన్ కాలనీకి చెందిన పి.మధుబాబు, కుసుమకుమారి దంపతులు అన్న ప్రసాద వితరణకు రూ. లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా.. ఆలయ పర్యవేక్షకులు డీవీవీ సత్యనారాయణ, ఆలయ అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

# డాక్టర్ జీవీ పూర్ణచందుకు లోకగురు పురస్కారం

విజయవాడ కల్చరల్: విజయవాడకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, శతాధిక గ్రంథకర్త, ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ జీవీ పూర్ణచందును 2026 ఏడాదికిగానూ లోకగురు పురస్కారానికి ఎంపిక చేసినట్లు వికాస విద్యార్థి వాహిని వ్యవస్థాపక అధ్యక్షుడు వేములపల్లి కేశవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బందరురోడ్డులోని సర్వోత్తమ గ్రంథాలయంలో 29వ తేదీ సాయంత్రం పురస్కారం అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి వికాస వాహిని, గురుపూర్ణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషసాయితోపాటు పలువురు సాహితీవేత్తలు, రచయితలు భాషా సేవకులు పాల్గొంటున్నారన్నారు.

# విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించేలా వినూత్న కృషితో అధ్యయన పుస్తకాలను రూపొందిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ.. విద్యాశాఖ అధికారులతో కలిసి గురువారం కలెక్టరేట్‌లో హిందీ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ముఖ్యమైన అంశాలను సమగ్రంగా పొందుపరిచిన ఈ స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త రమేష్ బాబు, జిల్లా ఉమ్మడి పరీక్షల మండలి కార్యదర్శి ఉమర్ అలీ, హిందీ రిసోర్స్ పర్సన్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి : జెడ్పీ సీఈఓ అరుణ

చిలకలపూడి(మచిలీ పట్నం): గ్రామాల్లో స్వచ్ఛరథం కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ జె.అరుణ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో గురువారం ఉమ్మడి కృష్ణాజిల్లా ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మూడు సంవత్సరాలుగా మండల పరిషత్ ఆదాయ వనరుల భాగస్వామ్యంతో చేపట్టిన పనుల వివరాలను నివేదిక రూపంలో అందజేయాలని అరుణ కోరారు. ఆదాయ వనరులకు మించి పనులు మంజూరు చేసే వాటి వివరాలను కూడా తెలపాలని, లేకుంటే వాటిని వెంటనే రద్దు చేయాలని సూచించారు. గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రెయిన్లతో పాటు తాగునీటి సరఫరాలో ఎటువంటి సమస్యలు ఉన్నా వాటికి నిధులు వెచ్చించి సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. స్వచ్ఛ రథం కార్యక్రమంలో నిత్యం మండల పరిధిలోని గ్రామాలను తనిఖీ చేసి పారిశుద్ధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ సంబంధించి ఆస్తుల వివరాలను నివేదిక రూపంలో అందజేయాలన్నారు. ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి వాటి ద్వారా ఆదాయ వనరులు పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ సీఈఓ ఆర్.సి.ఆనందకుమార్ పాల్గొన్నారు.

# ఏఐవైడీ-2026 ప్రతినిధిగా శ్రీకర్ ఎంపిక

గుంటూరు నగరానికి చెందిన యువ పారిశ్రామికవేత్త శ్రీకర్ మద్ది అంతర్జాతీయస్థాయిలో అరుదైన గౌరవం దక్కించుకున్నారు. భారత్-ఆస్ట్రేలియా మధ్య కీలకమైన ద్వైపాక్షిక యువ నాయకత్వ సదస్సు 'ఆస్ట్రేలియా ఇండియా యూత్ డైలాగ్ (ఏఐవైడీ-2026)కు ఎంపికయ్యారు. ఈ రెండు దేశాల మధ్య యువ నాయకత్వం, నూతన ఆవిష్కరణలు, ప్రజా విధానాలు, వ్యాపార సహకారం, ఇతర భవిష్యత్తు భాగస్వామ్యాలపై చర్చించే ముఖ్యమైన వేదికలలో ఏఐవైడీ ఒకటి. 2012లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ఏటా రెండు దేశాల నుంచి ప్రతిభావంతులైన 30 మంది యువ నాయకులను ఎంపిక చేస్తారు. వ్యాపారం, ప్రభుత్వం, సాంకేతికత, విద్య, మీడియా, కళలు.. ఇలా అనేక రంగాల నుంచి ఈ ఎంపిక ఉంటుంది. 13 ఏళ్లలో సుమారు 370 మందికి పైగా ఈ కార్యక్రమానికి హాజరు కాగా.. గతంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కర్ణాటక ఎంపీ తేజస్వి సూర్య పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శిగా మణిబాబు

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సత్తెనపల్లికి చెందిన చిన్నం మణిబాబును లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే మాచర్లకు చెందిన మేరాజ్యోత్ హనుమానాయక్‌ను పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి

మాచర్ల: పట్టణంలోని గుర్తు తెలియని వ్యక్తి గురువారం తెల్లవారు జామున బస్టాండ్ ఎదురు వెంగమాంబ కాంప్లెక్స్ వద్ద మృతి చెందాడు. సుమారు 42 సంవత్సరాలు కలిగిన వ్యక్తి అపస్మారక స్థితిలో మృతిచెందినట్లు తెలుస్తుంది. ఈ విషయాన్ని పట్టణ పోలీసులు స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు వారికి తెలుపగా పోలీసుల సహకారంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎవరైనా స్నేహితులు, బంధువులు సంబంధిత వ్యక్తిని గుర్తుపడితే మాచర్ల పట్టణ పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి మార్చురికి చేర్చారు.

# ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు

నూజండ్ల: ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇరువురు దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు ఐనవోలు ఎస్సై బి.వి.కృష్ణారావు గురువారం తెలిపారు. పల్నాడు జిల్లా పరిధిలో ఇటీవల ద్విచక్రాల చోరీ అధికమవుతున్నట్లు పలు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడమైందని అన్నారు. సీఐ బి.బ్రహ్మయ్య ఆదేశాలతో సిబ్బందితో కలిసి ముప్పరాజువారిపాలెం గ్రామంలో అనుమానాస్పదంగా ఉన్న ఇరువురు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని విచారించటం జరిగిందన్నారు. గ్రామానికి చెందిన దుర్గంపూడి సుబ్బారావు, నందిగం వెంకటశివయ్యలుగా గుర్తించామన్నారు. వివిధ సంఘటనల్లో ఆరు ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్లు వారు అంగీకరించటంతో కేసు నమోదు చేసిన ట్లు తెలిపారు.

# కారెంపూడిలో ఐపీ దాఖలు చేసిన వ్యాపారి

కారెంపూడి: ఒక వ్యాపారి రూ. కోటిన్నరకు పైగా ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ (ఐపీ) దాఖలు చేశారని సమాచారం గురువారం రాత్రి సంచలనం రేపింది. సదరు వ్యాపారి 22 మంది వద్ద మొత్తం రూ. 1,52,50,000లు అప్పుగా తీసుకుని వారందరికి ప్రాంసరీ నోట్లు రాసిచ్చారు. వారందరికి కూడా ఐపీ నోటీసులు సిద్ధం చేసినట్లు సమాచారం. అప్పు చెల్లించాలని అడుగుతున్నవారికి అప్పు చెల్లిస్తానని చెబుతూ వచ్చి తీరా ఐపీ దాఖలు చేయడంతో అప్పులిచ్చినవారంతా ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి, పొదుపు పథకాలు నడుపుతున్నాడనే నమ్మకంతో వ్యాపారులు అతనికి కూడా లక్షల్లో అప్పులిచ్చారని తెలుస్తోంది.

# సినీ రచయిత కోన వెంకట్‌కు మాతృ వియోగం

బాపట్ల: సినీ రచయిత నిర్మాత కోన వెంకట్‌కు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి కోన ధర్మావతి (82 )బుధవారం రాత్రి వైజాగ్‌లో కన్నుమూశారు. ఆమె మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతికి వదిన. ధర్మావతి మృతిపై సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# యువ రచయితల ఉత్సవానికి సోనీకి ఆహ్వానం


కంచికచర్ల: కేంద్ర సాహిత్య అకాడమీ దక్షిణ భారత యువ రచయితల ఉత్సవంలో పాల్గొనాలని తనకు ఆహ్వానం వచ్చిందని కంచికచర్ల గ్రామానికి చెందిన కవి, రచయిత తంగిరాల సోనీ గురువారం తెలిపారు. ఈ నెల 18వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈ కార్యక్రమం జరగనుంది. ఆరు రాష్ట్రాల నుంచి కన్నడ, కొడవ, మళయాళం, తుళు, మలైయాళి, తెలుగు భాషల నుంచి యువ కవులను ఎంపిక చేశారని సోనీ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల తరఫున కేంద్ర సాహిత్య అకాడమీ బెంగళూరు నుంచి తనకు ఆహ్వానం అందిందని పేర్కొన్నారు. సోనికి పలువురు కవులు, కళాకారులు, రచయితలు అభినందనలు తెలిపారు.

# క్రికెట్ మ్యాచ్ వివాదంలో గాయపడిన యువకుడు మృతి

గన్నవరం: క్రికెట్ మ్యాచ్‌లో తలెత్తిన ఘర్షణలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనపై గన్నవరం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కేసరపల్లి శివారు వి.ఎన్.పురం కాలనీకి చెందిన ఈడే వెంకటరామ చంద్(17) ఇంటర్మీడియెట్ వరకు చదివాడు. ఈ నెల 14వ తేదీన స్థానిక జెడ్పీ బాలుర హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో స్నేహితులతో కలిసి క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు వచ్చాడు. మ్యాచ్ విషయమై వెంకటరామచంద్, గన్నవరానికి చెందిన గోపీచంద్ మధ్య వివాదం తలెత్తింది. వీరి మధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఆగ్రహానికి గురైన గోపీ చంద్‌తో పాటు అతని స్నేహితులు రాకేష్, ఆనంద్, మణికంఠ బ్యాట్‌తో వెంకటరామ చంద్‌ను తీవ్రంగా కొట్టారు. తలకు బలమైన గాయాలైన వెంకటరామచంద్ విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. అతడి మృతదేహానికి గురువారం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వీఎన్.పురం కాలనీలో వెంకటరామచంద్ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడు తండ్రి ఈడే దుర్గాపవన్‌కుమార్, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో వెంకటరామచంద్ పాడెను వంశీమోహన్ మోశారు.

# 26 లక్షల ఓట్లపై గల్లంతు

**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. గత నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ నిర్వహించగా, ఇప్పటికే ఎక్కువ భాగం పూర్తయిందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. అయితే ఇంకా కొంత పని మిగిలి ఉండటంతో గడువును పొడిగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ కేంద్ర ఎన్నికల సంఘం ను కోరారు. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం మరో పది రోజుల అదనపు గడువును మంజూరు చేసింది. దీంతో మిగిలిన పనిని త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు మరింత చురుకుగా పనిచేస్తున్నారు.రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల నుంచి కూడా గడువు పొడిగించాలన్న అభ్యర్థనలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు సుమారు 88 శాతం సవరణ ప్రక్రియ పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. ఇంకా దాదాపు 12 శాతం పని మిగిలి ఉండగా, కొత్త గడువులో దానిని కూడా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడంతో పాటు, వాటిని సేకరించి డిజిటల్ రూపంలో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ఈ విధంగా ప్రతి ఓటరు వివరాలను సరిచూసి, ఖచ్చితమైన జాబితాను సిద్ధం చేయడంపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది.రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 4 కోట్ల 16 లక్షల 26 వేల 144 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీరందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. జూలై 14 నాటికి 3 కోట్ల 69 లక్షల 50 వేల 812 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేసినట్లు వెల్లడించారు. మరో 1.67 శాతం ఫారాల నమోదు మాత్రమే పెండింగ్‌లో ఉందని, అది కూడా త్వరలో పూర్తవుతుందని పేర్కొన్నారు.ఈ సవరణ ప్రక్రియలో కీలకమైన విషయం ఏమిటంటే, రాష్ట్రంలో ఇప్పటికే మరణించిన 14 లక్షల 19 వేల 644 మంది పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత ధృవీకరణ పూర్తయిన తర్వాత ఈ పేర్లు జాబితా నుంచి తొలగించబడతాయి. అదే విధంగా ఉద్యోగాలు, వ్యాపారం లేదా ఇతర కారణాలతో శాశ్వతంగా ఇతర రాష్ట్రాలు లేదా విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడిన వారి వివరాలను కూడా పరిశీలించారు.ఇప్పటికే 12 లక్షల 14 వేల 994 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారినట్లు గుర్తించిన అధికారులు, వారి ఓటు నమోదుపై కూడా తగిన చర్యలు చేపడుతున్నారు. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారిన వారి సంఖ్య కలిపితే దాదాపు 26 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.మరో పది రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియలో ఇంకా మరికొన్ని మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత రాష్ట్రంలో డబుల్ ఓటింగ్‌కు అవకాశం తగ్గడంతో పాటు, చెల్లని ఓట్లను తొలగించి మరింత పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయగలమనే ఆశాభావాన్ని ఎన్నికల అధికారులు వ్యక్తం చేస్తున్నారు. దీంతో రానున్న ఎన్నికల నిర్వహణ మరింత విశ్వసనీయంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.




## జగన్ ఫ్రస్టేషన్ అంతకు మించి



**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖపట్నం పర్యటనలో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన హామీలు చూస్తూ జగన్మోహన్ రెడ్డి పూర్తిగా విచక్షణ కోల్పోతున్నట్లుగా ఎవరికైనా అర్థమైపోతుంది. సముద్రంలో జరిగిన బోటు ప్రమాద బాధితులను పరామర్శించే క్రమంలో ఆయన మాట్లాడిన తీరు, వ్యవస్థలపై చేసిన విమర్శలు ఆయన పారదర్శకతను, చట్టాలపై ఉన్న అవగాహనను ప్రశ్నించేలా ఉన్నాయి. ఒక మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి, క్షేత్రస్థాయి న్యాయ సూత్రాలను పక్కనబెట్టి కొంత మందిని మోసం చేయడానికి అడ్డగోలుగా మాట్లాడేస్తున్నారు.సముద్రంలో వేటకు వెళ్లి బోటు మునిగిపోయిన ప్రమాదంలో వ్యవస్థలన్నీ శ్రమించి సహాయక చర్యలు చేపట్టిన విషయాన్ని జగన్ రెడ్డి పూర్తిగా పక్కనబెట్టేశారు. వాళ్లను కాపాడకపోవడం కోస్ట్ గార్డ్ చేసిన తప్పని తేల్చేశారు. కళ్ళు మూసి తెరిచే లోపు మూడేళ్లు అయిపోతాయని, వైసీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మత్స్యకార బాధిత కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున ఇస్తానని ఆయన హామీ ఇచ్చేశారు.ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉండి, బాధితులకు తక్షణమే ఎలాంటి ఆర్థిక సహాయం చేయకుండా, భవిష్యత్తులో అధికారంలోకి వస్తే ప్రజాధనం నుంచి కోటి రూపాయలు ఇస్తానంటూ కాలయాపనతో కూడిన హామీలు ఇవ్వడం బాధితులను మభ్యపెట్టడమే. గతంలో ఆయన హయాంలో వందల మంది మత్స్యకారులు చనిపోతే.. బోట్లు తగలబడిపోతే పైసా ఇవ్వని వ్యక్తి ఆయన అని అందరికీ తెలుసు.మరీ ముఖ్యంగా, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన హిట్ అండ్ రన్ కేసులో జగన్ వ్యవహరించిన తీరు చట్టాలను తెలిసిన వారిని సైతం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. బైక్ యాక్సిడెంట్ చేసి ఓ నిరుపేద వ్యక్తి మరణానికి కారణమవ్వడమే కాకుండా, పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు అసలు సంబంధం లేని మరో యువకుడిని నిందితుడిగా ఇరికించే ప్రయత్నం చేశాడు. ఆధారాలతో సహా దొరికిపోయిన తర్వాతే నిందితుడు లొంగిపోగా, అసలు ఆ 18 ఏళ్ల పిల్లోడిపై కేసు పెట్టడమే తప్పు అన్నట్లుగా జగన్ మాట్లాడటం వెనుక కేవలం రాజకీయ ఓటు బ్యాంకు ప్రయోజనాలే కనిపిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి.ఈ కేసులో నిందితుడిని వెనకేసుకురావడం ద్వారా చట్టం ముందు అందరూ సమానులే అనే ప్రాథమిక సూత్రాన్ని జగన్ రెడ్డి విస్మరించినట్లు స్పష్టమవుతోంది. నిందితుడు తమ పార్టీ నేత కుమారుడైనంత మాత్రాన, ఈ ప్రమాదంలో చనిపోయిన ఒక బీసీ సామాజికవర్గానికి చెందిన గొర్రెల కాపరి ప్రాణానికి విలువే లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన వ్యక్తికి చట్టాలపై కనీస అవగాహన లేకపోవడం, లేదా తెలిసి కూడా తప్పుడు కేసులను సమర్థించడం చూస్తుంటే ఆయన పూర్తి మైండ్ బ్యాలెన్స్ కోల్పోయారనడానికి ఈ విశాఖ పర్యటనే నిదర్శనంగా కనిపిస్తోంది.

## కేరళ రేంజ్ లో ఏపీలో ఆ 23 గ్రామాలు..!

**విశాఖపట్టణం, జూలై 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ పాలనలో సరికొత్త మైలురాయిని అందుకుంది. రాష్ట్రంలోని 23 గ్రామ పంచాయతీలు తమ అద్భుతమైన సేవలు, పారదర్శక విధానాలకు గానూ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఐఎస్ఓ గుర్తింపును సొంతం చేసుకున్నాయి. స్థానిక సంస్థల పరిధిలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఈ విజయంతో సత్ఫలితాలను ఇచ్చాయని స్పష్టమవుతోంది.గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వ రికార్డులను పక్కాగా నిర్వహించడం, ప్రజలకు కావాల్సిన వివిధ రకాల ధృవపత్రాలను (సర్టిఫికెట్లు) ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన జారీ చేయడంలో ఈ 23 పంచాయతీలు విశేష ప్రతిభ కనబరిచాయి. కార్యాలయాల నిర్వహణలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడంతో పాటు, జవాబుదారీతనంతో కూడిన పాలనను అందించినందుకు గానూ ఈ ఐఎస్ఓ సర్టిఫికేషన్ లభించింది. ఈ అరుదైన గుర్తింపు సాధించిన గ్రామ పంచాయతీల సిబ్బందిని, అధికారులను ఏపీ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ ఐఏఎస్ ప్రత్యేకంగా అభినందించారు.గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన సేవలందించడంలో సిబ్బంది చూపిన ప్రతిభను ఆయన కొనియాడారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో రాష్ట్రంలోని మరిన్ని గ్రామ పంచాయతీలు ఈ స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. స్థానిక స్వపరిపాలనలో దేశంలోనే ముందంజలో ఉన్న కేరళ రాష్ట్ర తరహాలోనే, ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాలను కూడా ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఏపీ పంచాయతీరాజ్ శాఖ గట్టి పట్టుదలతో ఉంది. అందులో భాగంగానే డిజిటలైజేషన్, వేగవంతమైన పౌర సేవలను విస్తృతం చేస్తూ, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని మరిన్ని గ్రామ పంచాయతీలకు కూడా ఐఎస్ఓ ప్రమాణాలు దక్కేలా అధికారులు ప్రత్యేక ప్రణాళికలతో కసరత్తు చేస్తున్నారు.

## నల్లమల్లో వజ్రాల వేట

**కర్నూలు, జూలై 16, పెన్ పవర్:** నంద్యాల – ఒంగోలు జాతీయ రహదారి పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రవాగులో వజ్రాల వేట మొదలైంది. పెద్దగా వర్షాలు కురవకపోయినా.. గతంలో కురిసిన వర్షాలకు అటవీ ప్రాంతం నుంచి నీరు వచ్చింది. దాంతో అడవిలోని వజ్రాలు వాగుతో సహా కొట్టుకొచ్చి ఉంటాయనే కారణంతో స్థానికులు వజ్రాల అన్వేషణ మొదలుపెట్టారు. నీటి అడుగు భాగంలో వజ్రాల కోసం అన్వేషణ చేస్తున్నారు. కడప, కర్నూలు, మార్కాపురం జిల్లా ప్రజలు ఎక్కువగా అన్వేషిస్తున్నారు.నల్లమల అటవీ ప్రాంతం మరోసారి ఆశావాహులతో కిటికిటలాడుతోంది. వర్షాకాలం మొదలైందంటే నల్లమల ప్రాంతమంతా వజ్రాల వేటే. ప్రతి ఒక్కరూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతుంటారు. కొంతమంది అయితే నెలల తరబడి ఇదే ప్రాంతంలో ఉంటూ వజ్రాల వేట కొనసాగిస్తారు. ముఖ్యంగా నంద్యాల ఒంగోలు ప్రధాన మార్గంలోని నల్లమల అడవీలో ఉన్న ఎర్రవాగు వైపే అందరూ ప్రయాణిస్తారు.నల్లమల అడవీలో ఉన్న ఎర్రవాగులో జోరుగా వజ్రాల వేట కొనసాగుతోంది. నంద్యాల, కర్నూలు, మార్కాపురం, కడప, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలోని గ్రామాలకు చెందిన మహిళలు, పురుషులు ఎర్రవాగుకు చేరుకుని వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. వాగు వెంట నీటిలో జల్లెడ పడుతున్నారు. ప్రతి ఏటా వాగులో నీరు ప్రవహించే సమయాల్లో వజ్రాల కోసం ఈ అన్వేషణ కొనసాగుతుంది.నెల రోజుల వ్యవధిలో ఇటీవల కురిసిన సాధారణ వర్షాలకు నల్లమలలో నీటి ప్రవాహం జరిగింది. దాంతో ప్రజలు వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. గత నెలలో కర్నూలు జిల్లా తుగ్గిలి మండలం జొన్నగిరిలో కూడా వజ్రాల వేట మొదలుపెట్టారు. జొన్నగిరి ప్రాంతంలో పొలాలకు వెళ్లి మరీ అన్వేషణ కొనసాగిస్తున్నారు. చిన్న వజ్రం దొరికినా తమ రాత మారుతుందనే ఆశతో ప్రజలు జల్లెడ పడుతున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపురంలోని వజ్రకరూర్, కర్నూలు జిల్లాలోని తుగ్గిలి, జొన్నగిరి వీటితో పాటు నల్లమల అటవీ ప్రాంతంలో కృష్ణా నది తీర ప్రాంతాల్లో వజ్రాల వేట కొనసాగుతోంది. తొలకరి వర్షాలకు మట్టి కొట్టుకుపోయి వజ్రాలు బయటపడతాయని ప్రజలు భావిస్తుంటారు. ఈ ప్రాంతాల్లో దొరికే వజ్రాలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది.నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లి సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రవాగు, రాళ్లవాగులో వర్షాకాలం వజ్రాల అన్వేషణ జోరుగా సాగుతుంది. గాజులపల్లి సమీపంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూర్వం స్వామి, అమ్మవార్ల కల్యాణానికి వజ్రాలను తలంబ్రాలుగా ఉపయోగించే వారని, అందుకే ఈ ప్రాంతంలో వజ్రాలు దొరికే అవకాశం ఉందని ప్రజలు భావిస్తారు. కేవలం స్థానికులే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు.

## ఎమ్మెల్యేల్లో అంతర్గత అసహనం

**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం పటిష్టమైన పాలనపై దృష్టి పెట్టినప్పటికీ, తెరవెనుక పార్టీ ఎమ్మెల్యేలలో పెరుగుతున్న అసంతృప్తి ఇప్పుడు అధిష్ఠానానికి సరికొత్త సవాల్‌గా మారుతోంది. అయితే, ఈ అసంతృప్తికి ప్రభుత్వంపై వ్యతిరేకత కానీ, నిధుల కొరత కానీ కారణం కాకపోవడం ఇక్కడ అసలు ట్విస్ట్. క్షేత్రస్థాయిలో తమకు దశాబ్దాలుగా శత్రువులుగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను, ప్రత్యర్థులను ప్రభుత్వం ఆర్థికంగా దెబ్బతీయకపోగా, అయాచితంగా కొన్ని నిర్ణయాల వల్ల వారు మరింత బలోపేతం అవుతుండటమే ఈ అసంతృప్తికి ప్రధాన కారణం.ఈ అంతర్గత అసహనానికి తాజా ఉదాహరణగా గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు నిలిచారు. గన్నవరం నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కేడర్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులకు, ఆయనకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే ఒక ప్రముఖ కన్స్ట్రక్షన్ సంస్థకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ పెండింగ్ పనుల కాంట్రాక్ట్ దక్కడంపై వెంకట్రావు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. తమ కళ్ల ముందే ప్రత్యర్థులు ప్రభుత్వ కాంట్రాక్టుల ద్వారా మళ్లీ ఆర్థికంగా పుంజుకుంటుంటే, నియోజకవర్గంలో తమ రాజకీయ ఉనికి ఏమవాలనే ఆందోళన ఆయనను బహిరంగంగానే మాట్లాడేలా చేసింది.వెంకట్రావు లేవనెత్తిన ఈ అంశం కేవలం గన్నవరానికి మాత్రమే పరిమితం కాలేదు, రాష్ట్రవ్యాప్తంగా మెజార్టీ టీడీపీ ఎమ్మెల్యేల అంతర్గత సమస్య ఇదేనని పొలిటికల్ సర్కిల్స్ లో విశ్లేషణలు సాగుతున్నాయి. గత ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర అణచివేతకు గురై, ఆస్తులు నష్టపోయి, పార్టీ కోసం నిలబడిన కార్యకర్తలపై నమోదైన పాత కేసులు ఇప్పటికీ పూర్తిగా పరిష్కారం కాలేదు. ఒకవైపు సొంత కేడర్ పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతుంటే, మరోవైపు ప్రత్యర్థి పార్టీ నేతలు అధికార యంత్రాంగంలోని కొందరు అధికారుల అండతో యథేచ్ఛగా తమ వ్యాపారాలను, ఆర్థిక సామ్రాజ్యాలను కాపాడుకోవడం ఎమ్మెల్యేలకు మింగుడుపడటం లేదు.అధికారంలోకి వచ్చిన కొత్తలో సహజంగానే అధికారులు పాత కాంట్రాక్టర్ల పెండింగ్ పనులను క్లియర్ చేయడం, సాంకేతిక కారణాల వల్ల పాత సంస్థలకే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంటుంది. కానీ, రాజకీయ క్షేత్రంలో ఇది తప్పుడు సంకేతాలు పంపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బతీయకపోతే, వారు రాబోయే రోజుల్లో మళ్లీ పుంజుకుని తమపైకే రాజకీయంగా దాడికి వస్తారనే భయం టీడీపీ ఎమ్మెల్యేలలో స్పష్టంగా కనిపిస్తోంది. అధికారుల నిర్ణయాలు తమ రాజకీయ భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని వారు అంతర్గత సమావేశాల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ప్రభుత్వ నిర్వహణ, పాలనాపరమైన సంస్కరణలపైనే పూర్తి దృష్టి పెట్టిన టీడీపీ హైకమాండ్‌కు, సొంత పార్టీ శాసనసభ్యుల మనోభావాలను , క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోపాలను గమనించడానికి తగినంత తీరిక లేనట్లు కనిపిస్తోంది. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే భావన కేడర్‌లో బలపడితే, అది రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఇమేజ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎమ్మెల్యేలు నేరుగా అసెంబ్లీ లోపల లేదా బహిరంగ వేదికలపై అసంతృప్తిని వెళ్లగక్కకముందే అధిష్ఠానం జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. టీడీపీ అగ్రనాయకత్వం ఈ తీవ్రతను గుర్తించి, నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల సమస్యలను ఆలకించకపోతే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉంది. బ్యూరోక్రసీ తీసుకునే నిర్ణయాలు పార్టీ రాజకీయ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారకుండా ఒక స్పష్టమైన కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ సీనియర్ నేతలు అనుకుంటున్నారు.

### చంద్రబాబుకు తీరక లేదు... లోకేష్ బిజీ బిజీ

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది మంచి ప్రభుత్వం అనే నినాదంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనను ముందుకు తీసుకెళ్తున్నారు. అయితే, ఈ మంచితనం ఇప్పుడు సొంత పార్టీ ఎమ్మెల్యేలకు, ముఖ్యంగా క్షేత్రస్థాయిలో కష్టపడిన కీలక నేతలకు ఒక కొత్త తలనొప్పిగా మారింది. తెలుగుదేశం పార్టీ లోని కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలలో అంతర్గత అసంతృప్తి రోజురోజుకూ పెరిగిపోతోంది. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వంటి నేతలు ఇటీవల బహిరంగంగానే తమ ఆవేదనను వెళ్లగక్కడం దీనికి నిదర్శనం. అయితే, ఈ అసంతృప్తి చంద్రబాబు నాయకత్వంపై కానీ, పార్టీ సిద్ధాంతాలపై కానీ కాదు. నియోజకవర్గాల స్థాయిలో తమ రాజకీయ, ఆర్థిక మనుగడకు పొంచి ఉన్న ప్రమాదంపైనే ఈ ఆందోళన అంతా.గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో తీవ్రమైన అణచివేతను, ఆర్థిక నష్టాలను భరించి, నియోజకవర్గాల్లో పార్టీ జెండాను మోసి గెలిచిన టీడీపీ ఎమ్మెల్యేలకు ఇప్పుడు ఒక విచిత్రమైన పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదార విధానాల వల్ల, నియోజకవర్గాల్లో పాత అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు, మైనింగ్ మాఫియా, ఆర్థిక శక్తులు ఇప్పటికీ యథేచ్ఛగా తమ వ్యాపారాలను సాగిస్తూ ఆర్థికంగా మరింత బలం పుంజుకుంటున్నారు. రాజకీయం ముగిసింది.. ఇక అందరూ సమానమే అనే ప్రభుత్వ ధోరణి వీరికి వరంగా మారింది. ప్రత్యర్థులు ఇలాగే ఆర్థికంగా బలపడితే, రాబోయే రోజుల్లో వారు తమకే ఏకు మేకవుతారనే సహజమైన భయం టీడీపీ ఎమ్మెల్యేలను వెంటాడుతోంది. చెడ్డవాళ్లకు చూపించే అతి మంచితనం.. చివరికి తమ రాజకీయ జీవితాలకే చేటు చేస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఎమ్మెల్యేలకు ఉన్న ఈ అంతర్గత, వ్యూహాత్మక సమస్యలను అధిష్ఠానానికి వివరించడం ఒక పెద్ద సవాలుగా మారింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, రాష్ట్ర బడ్జెట్ నిర్వహణ వంటి భారీ బాధ్యతలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. మరోవైపు ఐటీ, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రిగా నారా లోకేష్ కూడా నిరంతరం సమీక్షలు, పర్యటనలతో బిజీగా ఉన్నారు. కిందిస్థాయి ఎమ్మెల్యేల వ్యక్తిగత బాధలను, నియోజకవర్గాల గ్రౌండ్ రియాలిటీలను లోకేష్ ఒక్కరే పూర్తిగా వినడం లేదా పరిష్కరించడం ఆచరణాత్మకంగా సాధ్యం కావడం లేదు. దీనివల్ల క్యాడర్‌లో ఒక విధమైన ఒంటరితనం, ఆవేదన గూడుకట్టుకుంటున్నాయి.ఈ పొలిటికల్ గ్యాప్‌ను భర్తీ చేయడానికి టీడీపీ హైకమాండ్ తక్షణమే ఒక ప్రత్యేకమైన, అత్యంత నమ్మకమైన అంతర్గత వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పార్టీలోని సీనియర్ నేతలు లేదా పొలిట్‌బ్యూరో సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి, ప్రతి వారం ఎమ్మెల్యేలతో వన్-టు-వన్ సమావేశాలు నిర్వహించాలి. తమ సమస్యలను క్లియర్ కట్‌గా చెప్పుకునే వేదిక ఉందని, తమ ఆందోళనలపై అధిష్ఠానం కచ్చితంగా యాక్షన్ తీసుకుంటుందనే గట్టి నమ్మకం ఎమ్మెల్యేలలో కలగాలి. అప్పుడే క్షేత్రస్థాయిలో అసంతృప్తి చల్లారి, ప్రభుత్వం-పార్టీల మధ్య సమన్వయం కుదురుతుంది.పాలనలో మంచితనం, పారదర్శకత ఎంత ముఖ్యమో.. క్షేత్రస్థాయిలో పార్టీని నమ్ముకున్న రాజకీయ సైనికులకు రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యం. ప్రత్యర్థుల ఆర్థిక మూలాలను కట్టడి చేయకపోతే, రేపు స్థానిక సంస్థల ఎన్నికల్లో గానీ, భవిష్యత్తు రాజకీయాల్లో గానీ కూటమి తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి, చంద్రబాబు–లోకేష్ ద్వయం ఇప్పటికైనా కిందిస్థాయి నేతల అంతర్గత ఆవేదనను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ఒక పటిష్టమైన వేదికను ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో, ఈ చిన్న చిన్న అసంతృప్తులే రాబోయే రోజుల్లో పెద్ద అంతర్గత కుమ్ములాటలకు దారితీసే ప్రమాదం ఉందనేది ఎక్కువ మంది అభిప్రాయం.

## అయోమయంలో అమరావతి రైతులు



**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** రాజధాని అమరావతిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ట్రంక్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు ఏళ్ల తరబడి ఉన్న ప్రధాన అడ్డంకులు ఎట్టకేలకు తొలగిపోయాయి. సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి అత్యంత కీలకమైన ఉండవల్లి గ్రామంలోని సుమారు 2 ఎకరాల 77 సెంట్ల భూమిని ల్యాండ్ అక్విజిషన్ చట్టం ప్రకారం ప్రభుత్వం అధికారికంగా స్వాధీనం చేసుకుంది. రాజధాని అమరావతి అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా కొందరు రైతులు, వారి వెనుక ఉన్న శక్తులు భీష్మించుకు కూర్చున్నప్పటికీ.. గుంటూరు జిల్లా కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్ గడువు ముగియడంతో రెవెన్యూ, సీఆర్‌డీఏ యంత్రాంగం రంగంలోకి దిగి భూమిని ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించింది. దీంతో రాజధానిలో రవాణా వ్యవస్థకు గుండెకాయ లాంటి సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది.భూసేకరణ నిబంధనల ప్రకారం 10 మంది రైతులకు చెందిన ఈ 2.77 ఎకరాల భూమికి గాను ప్రభుత్వం మొత్తం రూ.7 కోట్ల 14 లక్షల భారీ పరిహారాన్ని ఖరారు చేసింది. ఈ లెక్కన ఎకరాకు సుమారు రూ.2 కోట్ల 58 లక్షల మేర నష్టపరిహారం లభిస్తుంది. శుక్రవారం రాత్రి సీఆర్‌డీఏ అధికారులు ఈ పరిహారానికి సంబంధించిన చెక్కులను నేరుగా రైతుల వద్దకు తీసుకువెళ్లినప్పటికీ, వారు వాటిని తీసుకోవడానికి నిరాకరించారు. అభివృద్ధికి సహకరించకుండా ఉద్దేశపూర్వకంగానే వారు చెక్కులను తిరస్కరించడంతో.. అధికారులు సదరు పరిహారం మొత్తాన్ని చట్టప్రకారం ఎల్.ఎల్.ఆర్.ఆర్ అథారిటీలో డిపాజిట్ చేశారు. అనంతరం రంగంలోకి దిగిన ఏడీసీఎల్ , ఎన్‌సీసీ కంపెనీల సిబ్బంది పనులను ముమ్మరం చేసి, 24 గంటల్లో గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు యుద్ధప్రతిపాదికన మట్టి పనులు జరుపుతున్నారు.అమరావతి ల్యాండ్ పూలింగ్‌కు మొదటి నుండి సహకరించకుండా కోర్టు స్టేలతో కాలయాపన చేసిన ఈ భూముల వెనుక పెద్ద ఎత్తున వైసీపీ నేతల రాజకీయ హస్తం ఉందనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిగిలిన రైతుల మాదిరిగానే వీరు కూడా ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చి ఉంటే, వాటికి బదులుగా వచ్చే కమర్షియల్, రెసిడెన్షియల్ ప్లాట్లను అమ్ముకున్నా ఎకరాకు సుమారు రూ.6 నుంచి 7 కోట్లకు పైగా వచ్చేది. కానీ, పూలింగ్‌కు ఇవ్వకుండా కేవలం రూ.2.58 కోట్ల ప్రభుత్వ పరిహారానికి పరిమితం కావడం వెనుక వైసీపీ నేతల ఇన్‌సైడర్ ఒప్పందాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాజధాని అభివృద్ధి ప్రాజెక్టులను అడ్డుకుంటే ఇచ్చే ప్యాకేజీలు, రాజకీయ లబ్ధి ఎక్కువగా ఉంటుందనే ఆశతోనే సదరు నేతలు ఈ భూములను ముందే కొనుగోలు చేసి, రైతుల పేరుతో తెరవెనుక డ్రామాలు ఆడించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డుకు ఆటంకంగా మారిన ఈ ల్యాండ్ పూలింగ్ వివాదంలో నోటీసులు ఇచ్చే వరకు మొత్తం 18 మంది రైతులు సుమారు 4 ఎకరాల మేర ఇవ్వకుండా మొండికేసారు. అయితే మారుతున్న పరిస్థితులు, లీగల్ చిక్కులను గమనించిన 8 మంది రైతులు ఇటీవలే తమ రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. మిగిలిన 2.77 ఎకరాలకు సంబంధించి ఒక స్థానిక న్యాయవాది స్వయంగా భూమి ఇవ్వనని పట్టుబట్టడంతో, ఆయన మాటలు నమ్మి మిగతా 9 మంది రైతులు కూడా ఇన్నాళ్లూ భూములను ఆపారు. దీంతో శనివారం ఉదయం అధికారులు మొదట సదరు లాయర్‌కు చెందిన పొలాన్ని స్వాధీనం చేసుకోవడంతోనే ఈ ఆపరేషన్ ప్రారంభించారు.

# ఫ్లెమింగ్ ఎగ్జిట్.. సీఎస్కేకు కొత్త కోచ్ ఎవరు? తెరపైకి ధోనీ పేరును తీసుకొచ్చిన అశ్విన్!




చెన్నై సూపర్ కింగ్స్ తో సుదీర్ఘకాలం పాటు కొనసాగిన హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ ప్రస్థానం ముగియడంతో, ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ఎల్లో ఆర్మీలో సరికొత్త చర్చ మొదలైంది. ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ అందించిన ఫ్లెమింగ్, సీఎస్కే యాజమాన్యం పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో జట్టుకు కొత్త హెడ్ కోచ్‌గా ఎవరు వస్తారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు.

**ధోనీయే పర్ఫెక్ట్ ఛాయిస్:**

సిఎస్కే జట్టుతో ఎంఎస్ ధోనీకి అపారమైన అనుభవం ఉందని రవిచంద్రన్ అశ్విన్ తెలిపారు. స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానాన్ని భర్తీ చేయడానికి ధోనీ కంటే ఉత్తమమైన వ్యక్తి మరొకరు లేరని తేల్చి చెప్పాడు. చెన్నై ఫ్రాంచైజీలో ధోనీకి తిరుగులేని ఇమేజ్, టీమ్ సెలక్షన్, కీలక నిర్ణయాల్లో అతనికున్న పట్టు దృష్ట్యా కొత్తగా వచ్చే ఏ కోచ్‌కైనా ఒత్తిడి తప్పదన్నాడు. గత 17 ఏళ్లుగా ఫ్లెమింగ్–ధోనీ జోడి ఎంతో విజయవంతంగా సాగింది. ధోనీ మైండ్ సెట్‌ను ఫ్లెమింగ్ కరెక్ట్‌గా అర్థం చేసుకునేవాడు. ఇక ధోనీ గనుక కోచ్ బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉంటే, సీఎస్కే మేనేజ్‌మెంట్ ఏమాత్రం ఆలోచించకుండా అతనికే పట్టం కట్టాలి.. ఒకవేళ ధోనీ కాదనుకుంటే, అతని ఇన్ఫ్లుయెన్స్‌కు లొంగకుండా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగల ధీటైన వ్యక్తిని వెతకాలని ఆర్. అశ్విన్ వెల్లడించాడు.

**రేసులో హేమంగ్ బదానీ:**

ప్రస్తుతం స్టీఫెన్ ఫ్లెమింగ్ వారసుడిగా మాజీ భారత బ్యాటర్ హేమంగ్ బదానీ పేరు క్రికెట్ సర్కిల్స్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ కు హెడ్ కోచ్‌గా సేవలందిస్తున్న బదానీ వైపు సీఎస్కే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపుతున్నట్లు రూమర్స్ వస్తున్నాయి. అయితే, బదానీ కోచింగ్, అక్షర్ పటేల్ కెప్టెన్సీలో ఢిల్లీ క్యాపిటల్స్ 2025లో 5వ స్థానం, అలాగే ఐపీఎల్ 2026లో 6వ స్థానంతో సరిపెట్టుకుంది. సీఎస్కే మళ్లీ తన పూర్వ వైభవాన్ని అందుకోవాలని చూస్తున్న తరుణంలో, బదానీ రీసెంట్ ట్రాక్ రికార్డును యాజమాన్యం ఎంత వరకు పరిగణనలోకి తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

**ముగిసిన ఫ్లెమింగ్ అద్భుతమైన లెగసీ:**

2008లో ఆటగాడిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, 2009 నుంచి సీఎస్కే హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ ప్రస్థానం నిజంగా ఒక స్వర్ణ యుగం (+శీశ్రీనవఅ జుతీఖ) అని చెప్పాలి.. 17 ఏళ్ల సుదీర్ఘ కోచింగ్ కెరీర్‌లో చెన్నైని ఐపీఎల్ చరిత్రలోనే మోస్ట్ కన్సిస్టెంట్ టీమ్‌గా నిలబెట్టాడు.

టైటిల్స్ రికార్డు: ఫ్లెమింగ్ ఆధ్వర్యంలో సీఎస్కే ఏకంగా 5 ఐపీఎల్ ట్రోఫీలు, 2 ఛాంపియన్స్ లీగ్ టీ20 టైటిళ్లను గెలుచుకుంది.

ప్లేఆఫ్స్ రికార్డు: రికార్డు స్థాయిలో 12 సార్లు ప్లేఆఫ్స్‌కు చేర్చడమే కాకుండా, 10 సార్లు ఐపీఎల్ ఫైనల్స్ ఆడించిన ఘనత ఫ్లెమింగ్ దే.

ప్రస్తుతం చెన్నై సూపర్ కింగ్స్ లో ఒక సరికొత్త రీబిల్డింగ్ ఫేజ్ (=వఎబఱశ్రీ౹ఱఅస్త్ర ూష్త్రుంవ) స్టార్ట్ కాబోతోంది. మరి ఈ నయా ఎరాను లీడ్ చేయడానికి ధోనీ పగ్గాలు అందుకుంటాడా, లేక సరికొత్త కోచ్ ఎంట్రీ ఇస్తాడా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది.

# విరాట్ కోహ్లీ సక్సెస్ రహస్యం అదే.. ఆసక్తికర విషయం చెప్పిన అభిషేక్ నాయర్



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అపారమైన విజయాల వెనుక ఉన్న అసలు రహస్యం, తన ఆట పద్ధతులపై అతనికి ఉన్న అచంచలమైన నమ్మకమేనని భారత మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ అన్నాడు. గతంలో ఆస్ట్రేలియా పర్యటనలో కోహ్లీ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న సమయంలో జరిగిన ఒక సంభాషణను గుర్తుచేసుకుంటూ, కోహ్లీ మైండ్‌సెట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ నాయర్ ఈ విషయాలను పంచుకున్నాడు.

కొన్నేళ్ల క్రితం ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో విరాట్ కోహ్లీ వరుసగా రెండుసార్లు డకౌట్ అయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అప్పుడే తాను భారత జట్టు సహాయక కోచ్ పదవి నుంచి తప్పుకున్నానని, అయినా కోహ్లీతో టచ్‌లో ఉన్నానని నాయర్ తెలిపాడు. “ఆ సమయంలో నేను కోహ్లీకి ఫోన్ చేసి, అంతా బాగానే ఉందా? ఏమైనా మాట్లాడాలనుకుంటున్నావా? అని అడిగాను. దానికి కోహ్లీ చాలా ప్రశాంతంగా ‘అంతా బాగానే ఉంది. ఇదంతా ఆటలో భాగమే’ అని సమాధానమిచ్చాడు” అని నాయర్ చెప్పాడు. ఆ తర్వాత తాను ఒక టెక్నికల్ విషయాన్ని గమనించానని, దాని గురించి చెప్పాలనుకుంటున్నానని కోహ్లీ అనుమతి కోరానని నాయర్ తెలిపాడు. “నేను ‘ఒక విషయం గమనించాను. వింటావా?’ అని అడిగాను. దానికి అతను నవ్వుతూ ‘వద్దు, నేను నా పద్ధతిలోనే చేస్తాను’ అని సున్నితంగా తిరస్కరించాడు. నాకు నవ్వొచ్చింది. ఆ తర్వాతి మ్యాచ్ అనంతరం నాకు అతడి నుంచి ‘నేను నా పద్ధతిలోనే చేశాను’ అనే సమాధానం వచ్చింది” అని నాయర్ ఆ సంభాషణను వివరించాడు.

ఈ ఒక్క సంఘటన విరాట్ కోహ్లీ ఎంతటి గొప్ప ఆటగాడో చెబుతుందని నాయర్ అభిప్రాయపడ్డాడు. “నా దృష్టిలో విరాట్ కోహ్లీ గొప్పతనానికి ఇదే నిదర్శనం. కఠిన సమయాల్లో ఎలా ఆడాలో గొప్ప ఆటగాళ్లకు బాగా తెలుసు. మనం విశ్లేషించగలం, ఊహించగలం. కానీ, వాళ్లు అంతర్జాతీయ స్థాయిలో పదేపదే రాణించి నిరూపించుకున్నారు. అందుకే విరాట్, రోహిత్ వంటి ఆటగాళ్లంటే నాకు అపారమైన గౌరవం” అని నాయర్ తెలిపాడు. తమ మీద తమకు ఉన్న ఈ నమ్మకమే వారిని మిగతా ఆటగాళ్ల నుంచి ప్రత్యేకంగా నిలుపుతుందని పేర్కొన్నాడు.

# భారత పేసర్ గుర్నూర్ బ్రార్‌కు డీమెరిట్ పాయింట్.. ఐసీసీ సీరియస్ వార్నింగ్!

ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద ఒక డీమెరిట్ పాయింట్ నమోదు

ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో బ్యాటర్ వైపు బంతి విసిరిన ఘటన

తప్పును అంగీకరించడంతో విచారణ లేకుండానే శిక్ష ఖరారు

రెండేళ్ల కాలంలో గుర్నూర్‌కు ఇదే తొలి తప్పిదం



భారత యువ ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ సింగ్ బ్రార్‌పై ఐసీసీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతడికి అధికారికంగా హెచ్చరిక జారీ చేయడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను రికార్డుల్లో నమోదు చేసింది. ఈ మేరకు ఐసీసీ నేడు ఒక ప్రకటన విడుదల చేసింది. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 14న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 8వ ఓవర్లో బౌలింగ్ చేస్తున్న గుర్నూర్ బ్రార్, బంతిని అందుకుని బ్యాటర్ వైపు అనుచితంగా, ప్రమాదకరంగా విసిరాడు. ఇది ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.9ను స్పష్టంగా ఉల్లంఘించడమేనని మ్యాచ్ అధికారులు నిర్ధారించారు. ‘అంతర్జాతీయ మ్యాచ్ సందర్భంగా క్రీడాకారుడిపై లేదా సమీపంలోకి అనుచితంగా, ప్రమాదకరంగా బంతిని విసరడం’ ఈ నిబంధన పరిధిలోకి వస్తుంది. ఈ ఆరోపణలను ఆన్‌ఫీల్డ్ అంపైర్లు కుమార్ ధర్మసేన, మైక్ బర్న్స్, థర్డ్ అంపైర్ శామ్ నొగాజ్‌స్కీ, ఫోర్త్ అంపైర్ రస్సెల్ వారెన్ మోపారు. అయితే, గుర్నూర్ బ్రార్ తన తప్పును అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ప్రతిపాదించిన శిక్షకు అంగీకారం తెలపడంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే శిక్షను ఖరారు చేశారు. గత 24 నెలల కాలంలో గుర్నూర్‌కు ఇదే మొదటి తప్పిదం కావడం

గమనార్హం. లెవల్ 1 ఉల్లంఘనలకు సాధారణంగా అధికారిక హెచ్చరిక నుంచి ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం వరకు జరిమానా, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లు విధించే అవకాశం ఉంటుంది. ఒక ఆటగాడి ఖాతాలో 24 నెలల వ్యవధిలో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ డీమెరిట్ పాయింట్లు చేరితే, వాటిని సస్పెన్షన్ పాయింట్లుగా మార్చి నిషేధం విధిస్తారు. రెండు సస్పెన్షన్ పాయింట్లు ఒక టెస్టు లేదా రెండు వన్డేలు/టీ20ల నిషేధానికి సమానం. కాగా, ఈ సిరీస్‌లో తొలి వన్డేను 6 వికెట్ల తేడాతో గెలిచిన భారత్ 1–0 ఆధిక్యంలో ఉంది. నేడు కార్డిఫ్‌లో ఇరు జట్ల మధ్య రెండో వన్డే జరగనుంది.



సీరత్ కపూర్ సిల్క్ చీరలో టైమ్‌లెస్ గాంభీర్యంతో స్టన్ చేసింది

# చరణ్ ‘పెద్ది’.. మేకర్స్ నిర్ణయం కలిసొచ్చినట్లుందే..



థియేటర్లలో మంచి విజయాన్ని అందుకున్న సినిమాలు ఓటీటీలో కూడా అదే రేంజ్ రెస్పాన్స్ ను అందుకోవడం రేర్. అయితే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన పెద్ది విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. థియేట్రికల్ రన్ ముగిసిన తర్వాత నెట్ ఫ్లిక్స్ లోకి వచ్చిన ఆ సినిమా, అక్కడ కూడా మంచి వ్యూయర్ షిప్ తో దూసుకెళ్తోంది. ముఖ్యంగా ఓటీటీ కోసం కొన్ని కొత్త సీన్స్ యాడ్ చేయాలన్న మేకర్స్ నిర్ణయం సినిమాకు అట్రాక్షన్ గా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన ఆ స్పోర్ట్స్ యాక్షన్ ఎంటర్టైనర్ థియేటర్లలో ఇప్పటికే భారీ వసూళ్లు సాధించి విజయాన్ని నమోదు చేసింది. ఆ సక్సెస్ కు కొనసాగింపుగా జూలై 9 నుంచి నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ ప్రారంభమైన తర్వాత కూడా సినిమాకు మంచి రెస్పాన్స్ లభిస్తోంది. థియేటర్లలో చూసిన ప్రేక్షకులే మరోసారి ఓటీటీలో సినిమా చూడటం విశేషంగా మారింది. దీనికి ప్రధాన కారణంగా ఓటీటీ వెర్షన్ లో యాడ్ చేసిన ఎక్స్ ట్రా సీన్స్ అని తెలుస్తోంది. థియేటర్లలో లేని కొన్ని ఎమోషనల్, డ్రామాటిక్ మూమెంట్స్ ను ఓటీటీ కట్ లో చేర్చడంతో ఇప్పటికే సినిమా చూసిన వారిలో కూడా మళ్లీ ఆసక్తి పెరిగింది. అదే సమయంలో థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు కూడా ఇప్పుడు ఆ సినిమాను పెద్ద ఎత్తున చూస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా పెద్దిపై పాజిటివ్ రెస్పాన్స్ కనిపిస్తోంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, పాత్రలోని భావోద్వేగాలు, యాక్షన్ సన్నివేశాలపై మళ్లీ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కథను దర్శకుడు మలిచిన తీరు, ఓటీటీ వెర్షన్ లో కనిపించిన కొత్త సీన్స్ సినిమాపై చర్చను మరింత పెంచాయి. డిజిటల్ ప్లాట్ ఫామ్ లో తొలి వారంలోనే పెద్దికి సుమారు 1.9 మిలియన్ వ్యూస్ వచ్చినట్లు సమాచారం. అదే సమయంలో భారత్ లో నెట్ ఫ్లిక్స్ ట్రెండింగ్ జాబితాలో టాప్ 10లో ఉండడం విశేషం.

మరో ఆసక్తికర అంశం ఏమిటంటే.. ప్రస్తుతం పెద్ది మూవీ సౌత్ లాంగ్వేజ్ లో మాత్రమే అందుబాటులో ఉండగా, హిందీ వెర్షన్ విడుదల కావాల్సి ఉంది. హిందీ వెర్షన్ స్ట్రీమింగ్ ప్రారంభమైన తర్వాత వ్యూయర్ షిప్ మరింత పెరిగే అవకాశముందని అంచనాలు వెలువడుతున్నాయి. సినిమా థియేటర్లలో విజయవంతమైతే ఓటీటీలో కూడా అదే కట్ విడుదల చేయడం కామన్. కానీ పెద్ది విషయంలో మాత్రం ప్రేక్షకులకు కొత్త ఎక్స్పీరియన్స్ కలిగించేలా కొత్త సీన్స్ యాడ్ చేయడం మేకర్స్ తీసుకున్న తెలివైన నిర్ణయంగా కనిపిస్తోంది. అదే ఇప్పుడు మరోసారి సినిమాపై ఆసక్తిని పెంచి, డిజిటల్ ప్లాట్ ఫామ్ పై కూడా మంచి రిజల్ట్స్ తీసుకొస్తోంది. ఇప్పటికే థియేటర్లలో సత్తా చాటిన పెద్ది.. ఇప్పుడు ఓటీటీలోనూ అదే జోరును కొనసాగిస్తోంది. రానున్న వారాల్లో ఆ సినిమా వ్యూయర్ షిప్ మరింత పెరిగి కొత్త రికార్డులు సృష్టిస్తుందా? లేదా అనే ఆసక్తి సినీ ప్రియుల్లో నెలకొంది. ప్రస్తుతం ట్రెండ్ చూస్తే.. మేకర్స్ తీసుకున్న చిన్న నిర్ణయం సినిమాకు మరో విజయాన్ని అందించినట్లే కనిపిస్తోంది.



సాక్షి మాలిక్ అద్భుతమైన గ్లామరస్ లుక్‌లో తలదాచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Nagendla venkateswarlu, Door no:7-1-107, station road, Narasaraopet, Palnadu District Andhrapradesh- 522601 Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2292, editorpenpower@gmail.com